ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ శుక్రవారం | 28 మార్చి 2025 | ■ 12 పేజీలు

వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ

మెరుగైన వైద్య సేవలందించాలి

ముజ్గి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేసిన నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

8

6



స్థానిక పోరుపై సందిగ్ధం!

- పంచాయతీ ఎన్నికలపై కొనసాగుతున్న సస్పెన్స్
- ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో తెలియని పరిస్థితి
- ఇంకా పెండింగ్‌లోనే గత సర్పంచుల బిల్లులు..
- పోటీకి జంకుతున్న సర్పంచ్ అభ్యర్థులు
- నిధులు వస్తాయనే గ్యారెంటీ లేదని అనుమానాలు
- పోటీకి దూరంగా సీనియర్ నాయకులు..
- కుల గణన సర్వే నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేయనుండడంతో ఆశావహుల్లో ఉత్కంఠ
- దీంతో ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశం లేదనే చర్చ

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

గ్రామ పంచాయతీ స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న ఆశావహుల ఆశలు నిరాశలవుతున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న అభ్యర్థులు ప్రస్తుతం రెండు అడుగులు వెనుకకు తగ్గిన పరిస్థితి నెలకొంది. గతంలో పనిచేసిన సర్పంచులకు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో అభ్యర్థులు వెనుకంజ వేస్తున్నట్లు రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎన్నికల నిర్వహణకు అధికారం యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆ తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ వస్తుందని భావించారు. చివరకు మరోసారి కుల గణన చేపట్టడంతో పాటు బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాకే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఇప్పట్లో ఎన్నికలు జరగవని తేలిపోయింది. ఎన్నికలకు మరో మూడు నెలల పాటు సమయం పట్టవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్న తరుణంలో ఎన్నికల వేడి తగ్గిపోయింది. కుల గణన సర్వే ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేయనుం డడంతో ఆశావహుల్లో రిజర్వేషన్లపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశం లేదనే చర్చ జరుగుతున్నది. దీంతో ఆశావహులు నిరాశలో ఉన్నారు.

12

కార్మిక క్షేత్రం

బెల్లంపల్లికి మహర్దశ!

- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు
- రూ.200 కోట్లతో ఆశ్రమ పాఠశాల
- 25 ఎకరాల్లో అత్యున్నతమైన విద్యాలయం
- ప్రత్యేక చొరవ చూపిన బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్..
- ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరుతో జాతీయ స్థాయిలో విద్య ప్రమాణాల సరసాన నిలువనున్న బెల్లంపల్లి

ఎట్టకేలకు బెల్లంపల్లి కార్మిక క్షేత్రం మహర్దశ సంతరించుకుంది. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలకు ప్రకటించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాల మంజూరులో బెల్లంపల్లికి చోటు కల్పించారు. దీంతో ఈ ప్రాంత వాసుల్లో సంతోషం వెల్లివెరుస్తోంది. పారిశ్రామిక ప్రాంతంగా పేరుగాంచి భూగర్భ గనుల వెనుకడుగుతో బెల్లంపల్లి ఉనికిని కోల్పోతుంది. ఈ నేపథ్యంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరుతో బెల్లంపల్లికి పూర్వ వైభవం రానుంది. నూతనంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరులో బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల నియోజకవర్గాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. రూ. 200 కోట్లతో ఒక్కో పాఠశాల 25 ఎకరాల విస్తీర్ణంలో అత్యున్నతమైన ప్రమాణాలతో భవనాలు ఏర్పాటు చేయనున్నారు.

12

అట్రాసిటీ కేసుల్లో బాధితులకు

న్యాయం చేయాలి

- ఏప్రిల్ 30 లోపు కేసులను పరిష్కరించాలి
- సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పడితే కఠిన చర్యలు
- ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య
- అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై అధికారులతో సమీక్ష

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ఏప్రిల్ 30లోపు పరిష్కరించాలని రాష్ట్ర షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లా అధికారులను ఆదేశించారు. ఆదిలాబాద్ జిల్లాలో పర్యటనలో భాగంగా గురువారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనకు కలెక్టర్, ఎస్పీ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు ఆయా సంఘాల నేతలు వినతి పత్రాలు అందజేశారు. కలెక్టరేట్‌లో చైర్మన్‌తో పాటు కమిషన్ సభ్యులు ప్రవీణ్, నీలాదేవి, లక్ష్మి నారాయణ, రాంబాబు, శంకర్ నాయక్, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వ హించారు.

నాలుగు గంటలు 5లో

నరకయాతన

- సోమగూడెం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఘోర ప్రమాదం
- ఐరన్ లోడ్‌తో వెళ్తున్న లారీని వెనక నుండి ఢీకొట్టిన మరో లారీ
- క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను బయటకు తీసిన పోలీసులు

జాయతీ రహదారిపైనే

ఇసుక లారీలు

- ఇసుక క్వారీతో వాహనదారులకు తప్పని ఇబ్బందులు
- రోడ్డుకు ఇరువైపులా వాహనాలతో నిత్యం ప్రమాదాలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు - 4లో

దివ్యాంగులు చీకటిని చీల్చుకుని

ఉదయించాలి

- వైకల్యాన్ని అధిగమించి.. జీవితంలో ముందుకు సాగాలి
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- జిల్లా విద్యాశాఖ, అలింకో సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

దివ్యాంగులు వైకల్యాన్ని అధిగమించి జీవితంలో ముందుకు సాగాలని, అన్ని రంగాలలో రాణించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ, అలింకో సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలను పంపిణీ చేశారు.

వివరాలు 12లో

వైకల్యాన్ని అధిగమించి
జీవితంలో ముందుకు సాగాలి

■ కలెక్టర్ కుమార్ దీపక్ ■ జిల్లా విద్యాశాఖ, అలింకో సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

మంచిర్యాల, మార్చి 27 (ప్రభాత సమాచారం)
దివ్యాంగులు వైకల్యాన్ని అధిగమించి జీవితంలో ముందుకు సాగాలని, అన్ని రంగాలలో రాణించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ, అలింకో సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, అలింకో సంస్థ ప్రతినిధులు డా॥రంజితేందర్ రెడ్డి, రిషిగుప్తాలతో కలిసి దివ్యాంగ విద్యార్థులకు సహాయ ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు తమ వైకల్యాన్ని అధిగమించాలని, అన్ని రంగాలలో రాణించాలని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన స్టీఫెన్ హాకిన్ పూర్తి అంగవైకల్యం కలిగి కదలలేని స్థితిలో మనో ధైర్యంతో ఉత్తమ శాస్త్రవేత్తగా ఎదిగాడని, దివ్యాంగులకు ఆదర్శంగా నిలిచాడని, సాధించాలనే పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని అన్నారు. కొంత మంది 70 నుండి 90 శాతం వరకు అంధత్వం కలిగి ఉంటారని, అటువంటి వారికి కంటి లెన్స్ అందించి కంటి చూపు మెరుగుపర్చవచ్చని తెలిపారు. చెవిటి దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. దివ్యాంగత్వం ఉన్న వారు ఆత్మ స్థైర్యంతో ముందడుగు వేస్తూ సాధారణ ప్రజల లాగా అన్ని రంగాలలో రాణిస్తున్నారని, పుట్టిన పిల్లల్లో ఏమైనా దివ్యాంగ లోపాలు గుర్తించినప్పుడు చిన్నతనం నుండి వారికి ప్రత్యేక అవసరాలను అందించాలని తెలిపారు. ఎంతటి సమస్య ఎదురైనా ముందడుగు వేయాలని, ఎలాంటి సమస్యలు ఎదురైనా ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, అధైర్యపడకుండా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. సైనికులుగా పని చేసి ప్రమాదాలలో కాలు, చేతులు కోల్పోయిన వారికి రోబోటిక్ అవయవాలు ఏర్పాటు చేయడంతో వారు అందరిలా సాధారణ జీవితం గడుపుతారని, ఏ సందర్భంలోను ధైర్యాన్ని కోల్పోకూడదని తెలిపారు. అలింకో సంస్థ ద్వారా 17 లక్షల 50 వేల రూపాయల విలువ గల వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్ళు, బ్రెయిలీ కిట్లు, సి.పి. చైర్లు మొత్తం 215 ఉపకరణాలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం సమాజంలో అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయని, దివ్యాంగత్వం ఉన్న వారు సహాయ ఉపకరణాల ద్వారా సామాన్య జీవితం గడపవచ్చని తెలిపారు. శిబిరంలో సహాయ ఉపకరణాలు పొందిన వారు వాటిని ఉపయోగించే విధానంపై శిక్షణ పొందాలని, సంబంధిత పరికరాలలో ఏమైనా సమస్య తలెత్తినట్లయితే పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి హాజరైన దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, భోజన వసతి, ఇతర సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు.

రాజీవ్ యువ వికాసాన్ని
సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాల, మార్చి 27 (ప్రభాత సమాచారం)
తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ల ద్వారా మైనార్టీ కమ్యూనిటీ, ముస్లిం మైనార్టీ కమ్యూనిటీలకు చెందిన యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అల్పసంఖ్యాకవర్గాల సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం ఉపాధి వ్యాపారాలను ప్రారంభించడంలో సాధికారత కల్పించేందుకు ప్రభుత్వం పథకం ప్రారంభించిందని, అర్హులైన క్రైస్తవ, ముస్లిం మైనార్టీలకు గరిష్ఠంగా 4 లక్షల రూపాయల వరకు ఆర్థిక సహాయం అందించి 70 శాతం నుండి 100 శాతం వరకు రాయితీ అందించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి 1 లక్షా 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షల రూపాయలకు మించి ఉండరాదని, రేషన్కార్డు వివరాలు దరఖాస్తు ఫారంలో ఇవ్వబడతాయని, రేషన్కార్డు అందుబాటులో లేని సందర్భంలో మాత్రమే అభ్యర్థి మీ-సేవ ద్వారా జారీ చేయబడిన ఆదాయ ధృవీకరణ పత్రాన్ని సమర్పించాలని తెలిపారు. ముస్లిం మైనార్టీకి చెందిన వారు బి.సి. - ఈ, క్రైస్తవ మైనార్టీకి చెందిన వారు బి.సి. -సి, బాపిస్ట్ సర్టిఫికెట్లు తప్పక సమర్పించాలని తెలిపారు. 5వ తేదీ లోగా ఆన్లైన్లో tgobmm-snew.cgg.gov.in/commo nregistration. action వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఆన్లైన్లో దరఖాస్తు ప్రతిని జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

అభివృద్ధి పనులు చేసిన బిల్లులు ఇవ్వండి

సర్పంచుల ముందస్తు అరెస్ట్ - సర్పంచుల డిమాండ్

ముథోల్, మార్చి 27 (ప్రభాత సమాచారం)
సర్పంచుల అభివృద్ధి చేసిన పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని గురువారం చలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టగా ముధోల్ పోలీసులు ముందస్తుగా మండల సర్పంచ్లను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేందర్ వెంకటాపూర్ మాట్లాడుతూ గత 16 నెలలుగా సర్పంచులు బిల్లుల ఆపేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,769 సర్పంచ్ ల అభివృద్ధి చేసిన బిల్లులను తెలంగాణ ప్రభుత్వము పెండింగ్ పెట్టడం శోచనీయమన్నారు. గ్రామాల్లో అభివృద్ధి చేసిన సర్పంచ్ల బిల్లులు ఆపేయడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రభుత్వము సర్పంచులు సమస్యలు మర్చిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు .ప్రైవేట్ కాంట్రాక్టర్లకు 40 వేల కోట్లు బిల్లులు చెల్లించి సర్పంచి బిల్లులు ఆపడం ఎంతవరకు సమంజసం అని ఎద్దేవా చేశారు. పెండింగ్ బిల్లులను ప్రభుత్వం చెల్లించక పోవడంతో సర్పంచులు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం సర్పంచ్లకు బిల్లులు చెల్లించి ఆదు కోవాలని కోరారు. లేదంటే కుటుంబం సమేతంగా అసెంబ్లీ ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు రామ్ రెడ్డి, రమేష్, గౌతం, మైసాజి, మురళి, రాజేందర్ రెడ్డి ఉన్నారు.

ఉట్నూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాపురెడ్డి

ఉట్నూర్, మార్చి 27 (ప్రభాత సమాచారం)
ఉట్నూర్ జూనియర్ మున్సిఫ్ కోర్ట్ నూతన ఎన్నికలు గురువారం స్థానిక కోర్టు అవరణలో నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షుడు బాపురెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జైవంత్ రావ్, ఉపాధ్యక్షుడు బానోత్ జగన్, కోశాధికారి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ భీమ నాయక్, స్పోర్ట్స్ సెక్రటరీ తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా వసంత్ రావ్, రామారావుగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు అధికారిగా అశోక్ వ్యవహరించారు. అనంతరం నూ తన అధ్యక్షుడు బాపు రెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాదుల సమస్యల సాధనకు తనవంతుగా కృషి చేస్తున్నారన్నారు.

అమ్మ పేరిట సేవ చేయడం
అభినందనీయం

బోథ్, మార్చి 27 (ప్రభాత సమాచారం)
కన్నతల్లి పేరు మీద మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద ఏర్పాటు చేసి గత 12 సంవత్సరాల నుండి సేవ చేయడం అభినందనీయం అని బోథ్ ఐకేపీ ఏపీఎం మాధవరావు అన్నారు. మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయం వద్ద చలివేంద్రంను స్థానిక మహిళ సంఘ సభ్యులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా భజరంగలదళ్ జిల్లా ప్రముఖ్ పాలిక్ రమేష్, పద్మశాలి జిల్లా సభ్యులు వడ్లకొండ సురేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐకేపీ ఏపీఎం మాధవ్ రావ్ మాట్లాడుతూ అనిల్ కుమార్ గత 10 సంవత్సరాలుగా సేవ కార్యక్రమలు చేశారు. చిన్న వయస్సులోనే డాక్టరేట్ పొందారు. మహిళ సంఘం సభ్యులు గుర్తించి వారి చేతుల మీదుగా చలి వేంద్రం ప్రారంభించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవ కార్యక్రమాలు చేయాలని మహిళల సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మాసం అనిల్ కుమార్ మహిళ సంఘం లీడర్ లక్ష్మీ, నిరంజని,లక్ష్మీ,పుష్ప గొర్ల, సంగీత, రంజిత్ బోథ్ పట్టణ మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని
ఢీకొన్న ఐచర్ వాహనం
ఒకరి దుర్మరణం

గుడిహత్నూర్, మార్చి 27 (ప్రభాత సమాచారం)
గుడిహత్నూర్ మండల కేంద్రంలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన ప్రకారం... ఇచ్చోడ వైపు నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న ఐచర్ వాహనం మండలంలోని మన్నూర్ గ్రామం వద్ద జాతీయ రహదారిపై నిలిచి ఉన్న సిమెంట్ లోడ్ లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐచర్ వాహన క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం ముందరి భాగం క్యాబిన్ పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఎస్సై మహేందర్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని రిమ్స్కు తరలించారు.

ఘనంగా రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు

ఆదిలాబాద్, మార్చి 27 (ప్రభాత సమాచారం)
సినీ హీరో రామ్‌చరణ్ జన్మదిన వేడుకలను శ్రీ అంజనీపుత్ర సేవా సమితి, మెగా ఫ్యామిలీ సేవా సమితి, ఆయన అభిమానులు గురువారం ఆదిలాబాద్ జిల్లా ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రాంచరణ్ పుట్టిన రోజును పురస్కరించుకొని స్థానిక కళావతి బ్లడ్ బ్యాంక్‌లో అభిమానులు రక్తదానం చేసి కేక్ కట్ చేసి తదనంతరం స్థానిక రిమ్స్ హాస్పిటల్లో గల శ్రీ సత్య సాయి ట్రస్ట్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మెగా ఫ్యామిలీ సినిమాల్లోనే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలలో కూడా ముందుండి అనేక సేవా కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేపడుతున్నారని వారికి అభిమానులుగా ఉండడం అదృష్టంగా భావిస్తున్నామని రామ్‌చరణ్ ఫ్యాన్స్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెగా ఫ్యామిలీ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు శ్రీరాం అనిల్, పర్వతనేని శ్రీనివాస్, వినయ్, వివేక్, ధీరజ్, తేజ, రమాకాంత్, స్వామి, చందు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ రామ్‌చరణ్ ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు ఎన్నో జరుపుకోవాలని, భవిష్యతులో మరిన్ని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ప్రార్థించారు. రక్తదానం చేసిన అభిమానులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. కార్యక్రమంలో మెగా అభిమానులు భారీ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- స్త్రీనిధి పతకంలో రాష్ట్ర స్థాయి అవార్డు రావడం అభినందనీయం
- మహిళా శక్తి పథకం ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాల, మార్చి 27 (ప్రభాత సమాచారం)
మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ఇందిరా మహిళా శక్తి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, మెప్మా పి.డి. మారుతి ప్రసాద్ లతో కలిసి ఎ.పి.ఎం.లు, మండల సమాఖ్య నాయకులు, కార్యదర్శులు, సభ్యులు, ఆర్.పి.లు, సి.ఓ.లు, టి.ఎం.సి.లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. సూక్ష్మ పరిశ్రమల క్రింద 5 వేల 684 యూనిట్లు ప్రతిపా దించగా 90 శాతం గ్రౌండింగ్ జరిగిందన్నారు. ఇందులో మొబైల్ ఫిష్, మిల్క్ పార్లర్లు, మేకలు, గొర్రెలు, కోళ్ళ పెంపకం ఇతర వివిధ రకాల విభాగాలతో వ్యాపార రంగంలో ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. చిన్న వ్యాపారాలతో పాటు బోర్ డ్రిల్లింగ్, కుట్టు మిషన్లు, వ్యవసాయ డ్రోన్లు, ఫ్లయాష్ బ్రిక్, కకూన్ బ్రెడ్ తయారీ, పౌల్ట్రీ షెడ్లు వంటి రంగాలలో అవకాశం కల్పించడం జరుగుతుందని, ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రుచికరమైన తెలంగాణ పిండి వంటల తయారీ చేపట్టిన ట్లయితే శిల్పారామంలో ఒక స్టాల్ ఏర్పాటు చేసేందుకు సహకరిస్తామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు జీవిత బీమా వినియో గించుకోవాలన్నారు. స్త్రీ నిధి పథకంలో మందమర్రి టౌన్ లెవల్ ఫెడరేషన్ సంస్థ రాష్ట్ర స్థాయి ప్రథమ స్థానంలో నిలిచినందున సంస్థ సభ్యులకు అవార్డు అందజేశారు.

నిత్యావసర సరకుల పంపిణీ

గాదిగూడా, మార్చి 27 (ప్రభాత సమాచారం)
మండలంలోని దాబా(కె) గ్రామానికి చెందిన దేవ్ రావు, రాజేశ్వరిల తల్లి తండ్రి అనారోగ్యంతో బాధపడుతు మృతి చెందారు. విషయం తెలుసుకున్న హైమన్ డార్ఫ్ బెట్టి ఎలిజిబెత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపకులు దుర్వ సంతోష్ మానవత దృక్పథంతో స్పందించి తనవంతుగా ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరకులను ఆ చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. విధి ఆడిన నాటకంలో ఇద్దరు చిన్నారులు తల్లిదండ్రులను కోల్పోవడం బాధాకరమని అన్నారు. తమ సంస్థ ఎల్లప్పుడూ ఈ చిన్నారులకు అండగా ఉంటుందని తెలిపారు. మానవత దృక్పథం కలిగిన ప్రతి ఒక్కరు ఈ ఇద్దరు చిన్నారులకు అండగా నిలువాల్సిన అవసరం ఉందని, తమకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో హైమన్ డార్ఫ్ బెట్టి ఎలిజిబెత్ స్మారక గ్రంథాలయ సభ్యులు నాని గౌడ్, పెందూరు సంతోష్, కాళ్లే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ యాత్రపై మండల సన్నాహక సమావేశం లో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

ఆసిఫాబాద్, మార్చి 27 (ప్రభాత సమాచారం)
పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలనీ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వ ప్రసాద్ రావు ఆదేశాల మేరకు వాంకిడి మండలం కేంద్రంలో గురువారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ యాత్రపై మండల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సక్కు కార్యకర్తలు, నాయకులు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా చేపట్టవలసిన విధానాలను వివరించి, దశ దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వాంకిడి, ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు గురునులే నారాయణ, మసాదే చరణ్, వాంకిడి మండల ఉప అధ్యక్షుడు శంకర్, బీసీ సెల్ అధ్యక్షుడు, గణేష్, టౌన్ ప్రెసిడెంట్, అనిల్, మాజీ ఎంపీటీసీ మారుతీ, మండల యూత్ అధ్యక్షులు ప్రశాంత్, దీపక్, జీవన్, ఆనందరావు, బొట్టుపల్లి జైరాం, మందోకర్ దాదాజీ, మొర్లే తిరుపతి, పత్రు, రమేష్, సదశివ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు

ఆదిలాబాద్, మార్చి 27 (ప్రభాత సమాచారం)
ఆదిలాబాద్ జిల్లా సంగారాభేరి అధ్యక్షులు జాదవ్ సంజీవ్ నాయక్ గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీలో గోర్ బోలి బంజారా భాషను ఎనిమిదో షెడ్యూల్లో చేర్చాలని సంబంధిత శాఖ మంత్రులను ఆదేశించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భారత దేశంలో సుమారు 13 కోట్ల బంజారాలు ఉండగా.. ప్రాంతాన్ని బట్టి వేర్వేరు భాషలు ఉన్నాయని, గోర్ బోలి బంజారా వేషధారణ గురించి చర్చించడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు.

ఫ్లెక్సీ తయారీదారుల నుంచి

టెండర్ల ఆహ్వానం

అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్, మార్చి 27 (ప్రభాత సమాచారం)
రైతు రుణమాఫీ, రైతు భరోసా లబ్ధిదారుల వివరాలను ప్రదర్శించుటకు ఫ్లెక్సీ తయారీదారుల నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాలలో రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలలో లబ్ధి పొందిన వారి వివరాలను గ్రామపంచాయతీ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలలో ప్రదర్శించేందుకై ఫ్లెక్సీ తయారీదారుల నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 6ఐ3 సైజులో ఒక ఫ్లెక్సీలో దాదాపు 35 నుంచి 40 మంది రైతుల పేర్లు ప్రచురించవలసి ఉంటుందన్నారు. దాదాపు 2000 ఫ్లెక్సీలు అవసరమగునని, ఒక్కో ఫ్లెక్సీ గరిష్ట ధర 350 రూపాయలుగా నిర్ణయించామన్నారు. ఆసక్తి గలవారు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, నిర్మల్ పేరు మీద పదివేల రూపాయల డీడీ ని (ఎస్బిఐ బ్యాంకు) తీసి సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయాల ప్రాంగణంలోని మొదటి అంతస్తులో గల 27వ నంబరు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఈనెల 27వ తేదీ నుంచి 29 వ తేదీ మధ్యాహ్నం 2 గంటల లోపు అన్ని పని వేళలలో జీఎస్టీ పత్రాలతో కలిపి సమర్పించాలని తెలిపారు. 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు టెండర్ దాఖలు చేసిన వారందరి సమక్షంలో టెండరు ఖరారు చేయబడునని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

సంక్షేమ పథకాల ఫలాలు

అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలి

- కలెక్టర్ల వీడియోకాన్ఫరెన్సులో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్

మంచిర్యాల, మార్చి 27 (ప్రభాత సమాచారం)
ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే విధంగా కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి సెర్ప్ సి. ఈ.ఓ. దివ్య దేవరాజన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా గ్రామీణాభివృద్ధి, పౌరసరఫరాల శాఖ అధికారులతో ఐ.కె.పి. ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు, యూనిక్ డిజేబులిటీ ఐ.డి. కార్డుల జారీ, దివ్యాంగులకు సదరం శిబిరాల నిర్వహణ, మరణించిన వృద్ధాప్య పింఛన్ దారుల స్థానములో స్పౌజు పింఛన్ మంజూరు, జాతీయ కుటుంబ ప్రయోజన పథకంలో అర్హులైన కుటుంబాలను గుర్తించడం, మహిళా సంఘాలకు పెట్రోల్ బంకుల నిర్వహణ, స్వయం సహాయక సంఘాలకు విద్యార్థుల ఏకరూప దుస్తులు తయారీకై కేటాయింపు, జిల్లా కేంద్రంలో మహిళ శక్తి భవన నిర్మాణం తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా వరి ధాన్యం కొనుగోలు కొరకు ఐ.కె.పి. ఆధ్వర్యంలో రబీ ధాన్యం కొరకు అధిక సంఖ్యలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గతంలో ఐ.కె.పి. ద్వారా చేపట్టిన ధాన్యం కొనుగోలుకు సంబంధించి కమీషన్ పెండింగ్ ఉన్న ప్రాంతాలలో త్వరగా ప్రక్రియ పూర్తి చేయాలని, కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన గన్నీ సంచులను అందించాలని తెలిపారు. ప్రభుత్వం దివ్యాంగుల కొరకు చేపట్టిన యూనిక్ డిజేబులిటీ ఐ.డి. కార్డుల కొరకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టిన చర్యలపై జిల్లా కలెక్టర్లను అభినందించారు. దివ్యాంగుల కొరకు సదరం శిబిరాలు ఏర్పాటు చేసి సహాయ ఉపకరణాలు అవసరం మేరకు సమకూర్చాలని తెలిపారు. ప్రస్తుతం పింఛన్ పొందుతున్న వయోవృద్ధులు మరణించినట్లయితే వారి స్పౌజుకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు తమ పరిధిలో డెత్ మార్కింగ్, పర్మనెంట్ మైగ్రేషన్ కేసులను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకంలో భాగంగా కుటుంబ పెద్ద మరణించినట్లయితే 20 వేలరూపాయలు అందించడం జరుగుతుందని, ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, ఇందులో భాగంగా మహిళ సంఘాలకు పెట్రోలు బంకులు నిర్వహించేందుకు అవకాశం కల్పించి ప్రోత్సహించాలని తెలిపారు. మహిళ స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక స్వావలంబన లభించే విధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు ఏకరూప దుస్తులు తయారీ చేసేందుకు అవకాశం కల్పించాలని, వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా సిద్ధం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి పథకాల ఫలాలు అందే విధంగా పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రబీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో భాగంగా ఐ.కె.పి. ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు ఎక్కువ సంఖ్యలో కేంద్రాలను కేటాయించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులకు యూనిక్ డిజేబులిటీ ఐడి కార్డులను జారీ ప్రక్రియలో ప్రజలందరికీ తెలిసే విధంగా జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందన్నారు. దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నా మని తెలిపారు. వృద్ధాప్య పింఛన్ పొందుతూ మరణించిన వారి కుటుంబంలో అర్హులైన వారికి పింఛన్ మంజూరు చేసేం దుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఏకరూప దుస్తులు పంపిణీ చేసేలా స్వయం సహాయక సంఘాల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామన్నారు.



మాజీ మంత్రి జోగురామన్నను
కలిసిన ఎమ్మెల్సీ కవిత

ఆదిలాబాద్, మార్చి 27 (ప్రభాత సమాచారం)
మాజీ మంత్రి జోగురామన్నను గురువారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలో రాజకీయ పరిస్థితులపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుతం సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే దీక్షల గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై బీఆర్ఎస్ పక్షాన ఒత్తిడి పెంచుతామన్నారు.

నకిలీ విత్తనాలు
విక్రయిస్తే కఠిన చర్యలు

తాండూర్, మార్చి 27 (ప్రభాత సమాచారం)
నకిలీ పత్తి విత్తనాలను విక్రయించినా, కొనుగోలు చేసిన చర్యలు తప్పవని తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని చంద్రపల్లి గ్రామంలో గురువారం నకిలీ పత్తి విత్తనాలపై రైతులకు పోలీసులు అవగాహన సమావేశం నిర్వహించారు. నకిలీ విత్తనాలు వాడడం వల్ల భూమి యొక్క సారవంతం కోల్పోయి రానున్న రోజుల్లో పంట దిగుబడి తగ్గుతుందని, పర్యావరణంపై ప్రభావం పడుతుందన్నారు. నకిలీ విత్తనాలు అమ్మిన, కొనుగోలు చేసిన ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

ప్రమాదాల నివారణకు
హోటళ్లపై దాడులు

నిర్మల్, మార్చి 27 (ప్రభాత సమాచారం)
నిర్మల్ రూరల్ మండలంలోని రానాపూర్ పరిసర ప్రాంతాలలో గల దాబాలు తదితర వాటిపై దాడి చేసి రూ. 73,187 విలువ గల 104 లీటర్ల మందు బాటిల్ స్వాదీనపరుచుకొని సీజ్ చేసినట్లు అదనపు ఎస్పీ రాజేష్ మీనా గురువారం తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దాబాలు బార్లు హెూటల్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రధాన రహదారులలో ప్రమాదాల నివారణకు ఈ తరహా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాత్రి వేళలో భారీ వాహనదారులు మద్యం సేవించి రోడ్డు ప్రమాదాలకు గురవుతునాన్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ, ఎస్సైలు ఏఎస్ఐలు ఉన్నారు.

జాతీయ రహదారిపైనే ఇసుక లారీలు

ఇసుక క్వారీతో వాహనదారులకు తప్పని ఇబ్బందులు - రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలపడంతో నిత్యం ప్రమాదాలు - పట్టించుకోని అధికారులు

చెన్నూర్, మార్చి 27 (ప్రభాత సమాచారం)
కోటపల్లి మండలంలోని కొల్లూరు ఇసుక క్వారీ వద్ద నిజామాబాద్ - చత్తీస్‌ఘడ్ జాతీయ రహదారిపై ఇసుక కోసం వచ్చిన లారీలు రోడ్డుకు ఇరువైపులా నిలుపడంతో వివాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అత్యవసర పని నిమిత్తం వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంచిర్యాల నుంచి చెన్నూరు మీదుగా మహారాష్ట్ర, చత్తీస్ ఘడ్ రాష్ట్రాలకు వెళ్లాల్సిన ఈ జాతీయ రహదారిపై ఇసుక కోసం వచ్చిన లారీలు, ఇసుక నింపుకున్న లాలీలను నిలిపి ఉంచడంతో ట్రాఫిక్‌తో జామ్ అవుతుంది. దీనితో గంటల తరబడి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపులా భారీ వాహనాలు నిలపడంతో ముందుగా వచ్చే వాహనాలు కనపడకపోవడంతో అనునిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

వాహనదారుల ఫిర్యాదుతో...
ఈ జాతీయ రహదారిపై ప్రతిరోజు వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. రోడ్డుపైన వాహనాలు నిలిపి ఉంచడంతో తలెత్తుతున్న ఇబ్బందులను ప్రయాణికుడు ఒకరు వీడియో తీసి అధికారులకు చెన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామికి చేరేలా పంపించారు. ఈ వీడియో నియోజకవర్గంలో వైరల్ కావడంతో స్పందించిన కోటపల్లి తహాసిల్దార్ రాఘవేందర్ రావు, సీఐ సుధాకర్‌లు సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరించారు. మునుముందు ట్రాఫిక్ సమస్య ఎదురు కాకుండా ఉండేందుకు ఇసుక రీచ్ నిర్వాహకులకు వాహనాలు రహదారిపై నిలువకుండా చూడాలని ఆదేశించారు.

అడ్డుకున్న అటవీ శాఖ.. నిలిచిన ఇండ్ల నిర్మాణం

పెంబి, మార్చి 27 (ప్రభాత సమాచారం)
పెంబి మండలంలోని గిరిజన గ్రామాల్లో ఐటీడీఏ నిర్మిస్తున్న ఇండ్లు మధ్యంతరంగా నిలిచిపోయాయి. అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడంతోనే ఇండ్ల నిర్మాణం నిలిచిపోయిందని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐటీడీఏ ద్వారా మండలంలోని జంగంగూడ గ్రామపంచాయతీ పరిధి కొలంగూడ గ్రామంలో 8 ఇండ్లు, తాటిగూడ గ్రామపంచాయతీలోని కొలంగూడలో 10 ఇండ్లు, పుల్గంపాండ్రిలో 6 ఇండ్లు, దయ్యాలమద్ది గ్రామంలో 9 ఇండ్లు మంజూరయ్యాయి. ఒక్కొక్క ఇల్లుకు రూ.2.5 లక్షలు మంజూర య్యాయి. ఇందులో భాగంగా జంగంగూడ గ్రామపంచాయతీ పరిధిలోని కొలంగూడలో 8 ఇండ్లు పిల్లర్లు వేశారు. అయితే అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడంతో పిల్లర్ల దశలో ఇండ్లు నిలిచిపోయాయి. మిగతా గ్రామాలలో భూమిపూజా చేసి ఆపేశారు. ఇండ్ల నిర్మాణ పనులను మధ్యంతరంగా నిలిపివేయాడంతో లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. అటవీ శాఖఅధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, స్పందించి ఇండ్లు నిర్మించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంక్షేమ పథకాలను పకడ్బందీగా చేపట్టాలి

వీడియోకాన్ఫరెన్సులో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్

ఆసిఫాబాద్, మార్చి 27 (ప్రభాత సమాచారం)
ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలుచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ సూచించారు. గురువారం హైదరాబాద్ నుంచి సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు జిల్లా గ్రామీణాభివృద్ధి, పౌరసరఫరాల శాఖ అధికారులు, ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగో లు, యూనిక్ డిసెబులిటి ఐడీ గుర్తింపు కార్డుల జారీ, దివ్యాంగులకు సదరం శిబిరాల నిర్వహణ, పరికరాలు సమకూర్చడం, జాతీయ కుటుంబ ప్రయోజన పథకంలో అర్హులైన కుటుంబాలను గుర్తించడం, మహిళా సంఘాలకు పెట్రోల్ బంకుల నిర్వహణ, స్వయం సహాయక సంఘాలకు విద్యార్థుల ఏకరూప దుస్తుల తయారీకి కేటాయింపు, జిల్లా కేంద్రంలో మహిశాశక్తి భవన నిర్మాణం, తదిత అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ధాన్యం కొనుగోలు కొరకు ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన రైతులకు లబ్ధిచేకూరే విధంగా చర్యలు తీసుకో వా లన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల కోసం చేపట్టిన యూనిక్ డిసెబులిటి ఐడీ గుర్తింపు కార్డులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ భవన సముదాయంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో భాగంగా ఐకే పీ ఆద్వర్యంలో మహిళా సంఘాలకు కేటాయించేందుకు కార్యచరణ రూపొందిస్తున్నామన్నారు. దివ్యాంగులకు యూనిక్ డిసెబులిటీ ఐడీ కార్డులను జారీ చేసేందుకు సదరం క్యాంపుల నిర్వహణ, పరికరాలు సమకూర్చడం కొరకు భవనాన్ని గుర్తించామన్నారు. సమావశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అదికారి దత్తారావు, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయులు
రాజీనామా చేయాలి'

గాదిగూడ, మార్చి 27 (ప్రభాత సమాచారం)
సరైన సమయంలో విధులు నిర్వహించకుండా ఇష్టారీతిలో విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు వెంటనే రాజీనామా చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి పెందోర్ సంతోష్ అన్నారు. గురువారం గాదిగూడలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెనుకబడిన ఏజెన్సీ మండలంలో టీచర్స్ సమయానికి విధులు నిర్వహించకుండా విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామ సమృద్ధి కోసం
హనుమాన్ పూజలు

నార్నూర్, మార్చి 27 (ప్రభాత సమాచారం)
నార్నూర్ మండలంలోని ఎంపల్లి గోండుగూడలో గురువారం ఆదివాసీలు కలిసి గ్రామ సమృద్ధిని కోరుతూ శ్రీ హనుమాన్ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ మహిళలు మహా హారతీలతో దేవతకు పూజలు చేశారు. గ్రామంలో శాంతి, రైతుల పంటలకు దిగుబడి రావాలని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో అమృత్ రావు పటేల్, రాము, దేవిదాస్, జంబీరావు, మోతిరాం, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్, మార్చి 27 (ప్రభాత సమాచారం)
జిల్లాలోని ఎస్సీ, మైనార్టీ యువకులకు టెలి హెల్త్ సర్వీస్ కో-ఆర్డినేటర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఆర్డీఓ రవీందర్ రాథోడ్ తెలిపారు. 30 సంవత్సరాలలోపు వయస్సు ఉండి ఆసక్తి గలవారు 28న అన్ని ధ్రువీకరణ పత్రాలతో టీటీడీసీలో హాజరు కావాలని సూచించారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

■ మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంకుల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వ వినూత్న ఆలోచన..

■ బంకుల వద్ద ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్ ■ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్



నిర్మల్, మార్చి 27 (ప్రభాత సమాచారం)

జిల్లాలో ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల (యూడిఐడి కార్డుల) పంపిణీ కోసం అర్హుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. గురువారం హైదరాబాద్ నుంచి సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి సెక్రటరీ లోకేష్ కుమార్‌తో కలిసి జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో యుడిఐడి కార్డులు, ఇందిరా మహిళా శక్తి పెట్రోల్ బంకుల ఏర్పాటు, ప్రమాద బీమా మంజూరు, ఏకరూప దుస్తుల తయారీ, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. సెర్ప్ సీఈఓ మాట్లాడుతూ, అన్ని జిల్లాల్లో ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డులను జారీ చేసేందుకై అర్హుల గుర్తింపు ప్రక్రియను ప్రారంభించాలన్నారు. యుడిఐడి కార్డులను పొందేందుకై దివ్యాంగులకు నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులందరికీ ఏకరూప దుస్తులను పంపిణీ చేసేందుకై, ఎస్‌హెచ్‌జి సభ్యులచే ఏకరూప దుస్తుల తయారీ ప్రక్రియను ప్రారంభించాలన్నారు. ఇందిరా మహిళా శక్తి పెట్రోల్ బంకులు, విద్యుత్ వాహనాల ఛార్జింగ్ కేంద్రాలు, మహిళా శక్తి బజార్లు ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలాలను గుర్తించాలన్నారు. మహిళా శక్తి బజార్లలో ఆయా జిల్లాల్లో స్థానికంగా తయారయ్యే లభ్యమయ్యే వస్తువులను, మహిళా సంఘాలచే తయారు చేయబడిన వస్తువులను ఒక చోటికి చేర్చి విక్రయించాలన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన మహిళా సంఘాల సభ్యులకు సంబంధించిన భీమా డబ్బులను మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, యుడిఐడి కార్డుల మంజూరు కోసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే నమోదు చేసుకున్న దివ్యాంగులకు సమాచారం అందించి, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో యుడిఐడి కార్డుల నమోదు శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. యూడిఐడి కార్డుల ప్రక్రియపై సందేహాలను తొలగించేందుకు హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేశామన్నారు. మహిళా శక్తి పెట్రోల్ బంకులు, విద్యుత్ వాహనాల ఛార్జింగ్ కేంద్రాలు, ఏర్పాటు చేసేందుకై అనువైన స్థలాలను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఇప్పటికే ఇందిరా మహిళా బజార్ ఏర్పాటుకు సంబంధించి స్థల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని, ఇందిరా మహిళా బజార్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సంవత్సరం నుంచి ఐకెపికి అదనపు వరి కొనుగోలు కేంద్రాలను కేటాయించడంతో పాటు సిబ్బందికి శిక్షణను అందించనున్నామని తెలిపారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌లు, ఆర్డీవో రత్నక ల్యాణి, ఇన్ ఛార్జ్ డిఆర్డిఓ శ్రీనివాస్, మెప్మా పీడీ సుభాష్, డిఎస్ఓ కిరణ్ కుమార్, డిఎం సివిల్ సప్లయిస్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో
సాంకేతిక లోపం

నిలిచిపోయిన యువ వికాసం

దరఖాస్తుల అప్లోడింగ్ విధానం..

ఇబ్బంది పడుతున్న దరఖాస్తుదారులు

బెల్లంపల్లి, మార్చి 27 (ప్రభాత సమాచారం)

బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఇంటర్నెట్ సేవల్లో తలెత్తిన సాంకేతిక లోపం వల్ల తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన యువ వికాసం పథకం అభ్యర్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ పథకానికి దంఖాస్తు చేసుకునే నిరుద్యోగ యువతీ యువకులు తహసీల్దార్ కార్యాలయంలో కులం, ఆదాయం సర్టిఫికెట్లతో పాటు ఇతర సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఇంటర్నెట్ సేవల్లో తలెత్తిన సాంకేతిక లోపం లబ్ధిదారులకు తలనొప్పిగా మారుతుంది. గురువారం సాంకేతిక లోపం తలెత్తడంతో అభ్యర్థుల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందపరచలేకపోయామని తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు వాపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న ఆన్‌లైన్ విధానంలో సమస్య తలెత్తడంతో అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. సాంకేతిక సమస్య తీరిన వెంటనే ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు చేసుకునే లబ్ధిదారులకు సర్టిఫికెట్లను సిద్ధం చేసి అందిస్తామని ఉద్యోగులు చెబుతున్నారు.

సోమగూడెం పై ఓవర్ బ్రిడ్జిపై ఘోర ప్రమాదం

■ ఐరన్ లోడ్‌తో వెళ్తున్న లారీని ఢీకొట్టిన మరో లారీ

■ క్యాబిన్‌లోని డ్రైవర్‌ను బయటకు తీసిన పోలీసులు

■ క్యాబిన్‌లో ఇరుక్కొని డ్రైవర్ 4 గంటలు నరకయాతన

బెల్లంపల్లి, మార్చి 27 (ప్రభాత సమాచారం)

మంచిర్యాల జిల్లా కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెం జాతీయ రహదారి సోమగూడెం ఓవర్ బ్రిడ్జిపై గురువారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆగి ఉన్న ఇనుము లోడ్ లారీని ఇనుప రాడ్లతో వెళ్తున్న మరో లారీ వెనుకాల నుంచి ఢీ కొట్టింది. ఢీకొట్టిన లారీలో ఉన్న డ్రైవర్ గుర్జిత్ సింగ్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. వెంటనే సమాచారం అందుకున్న కాసిపేట ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పెట్రో కార్ ఏఎస్ఐ బూర రవీందర్, బ్లూకోర్ట్ పీసీ సాజన్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ముందుగా మంటలు చెలరేగకుండా ముందస్తు జాగ్రత్తగా ఫైర్ ఇంజన్‌తో నీళ్లు చల్లి పోలీసు, 108 సిబ్బందితో కలిసి నాలుగు గంటల పాటు శ్రమించి డ్రైవర్‌ను భయటకు తీశారు. క్యాబిన్‌లో ఇరుక్కున్నంతసేపు 108 సిబ్బంది ఆక్సిజన్, ఫ్లూయిడ్స్ అందించి చికిత్స అందించారు. క్యాబిన్లో కాళ్లు విరిగి నాలుగు గంటల పాటు డ్రైవర్ నరకయాతనకు గురయ్యారు. డ్రైవర్‌కు ధైర్యం చెప్పుకుంటూ నాలుగు గంటల పాటు శ్రమించి అతి కష్టం మీద డ్రైవర్‌ను బయటకు తీసి అంబులెన్స్‌లో మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. బ్రిడ్జి మధ్యలో ప్రమాదం జరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు పై ఓవర్ బ్రిడ్జి కింది నుంచి వాహనాలను మళ్లించారు. నాలుగు గంటల పాటు శ్రమించి డ్రైవర్‌ను కాపాడేందుకు కృషి చేసిన పోలీసులను, 108 సిబ్బందిని స్థానికులు అభినందించారు.

నకిలీ విత్తనాలపై నెన్నెలలో
అవగాహన ర్యాలీ

బెల్లంపల్లి, మార్చి 27 (ప్రభాత సమాచారం)

బెల్లంపల్లి నియోజకవర్గంలో నిత్య కృత్యంగా మారుతున్న నకిలీ పత్తి విత్తనాల వ్యవహారంపై పోలీసులు స్పందించారు. నకిలీ విత్తనాల వాడకం వల్ల జరిగే అనర్థాలపై గురువారం నెన్నెల మండల కేంద్రంలో రైతులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రెవెన్యూ, వ్యవసాయ, పోలీసు సంయుక్తంగా నిర్వహించిన ఈ ర్యాలీలో రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి రూరల్ సిఐ సయ్యద్ అఫ్జలోద్దీన్ మాట్లాడుతూ రైతుల అమాయకత్వాన్ని ఆధారంగా చేసుకుని కొంతమంది నకిలీ పత్తి విత్తనాల దందాకు తెరలేపుతున్నారని తెలిపారు. వ్యవసాయ అధికారులు సూచించిన పత్తి విత్తనాలను మాత్రమే వినియోగించాలని రైతులకు సూచించారు. ఎక్కడైనా నకిలీ పత్తి విత్తనాలు విక్రయించినట్లు తెలిసిన పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. దళారుల మాటలు నమ్మి నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మెన హరీష్ గౌడ్,ఎస్సై ప్రసాద్‌తో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఖానాపూర్, మార్చి 27 (ప్రభాత సమాచారం)

ఖానాపూర్ మండలం తర్లపాడు గ్రామం వద్ద ఆటోలో అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. కడెం నుంచి తర్లపాడు వైపు వస్తున్న ఆటోను తనిఖీ చేయగా దానిలో అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టుకుని సీజ్ చేసినట్లు ఆటో యజమాని షేక్ రహమత్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రాష్ట్రంలో అసమర్థ పాలన కొనసాగుతుంది

బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

కాగజ్‌నగర్, మార్చి 27 (ప్రభాత సమాచారం)

తెలంగాణలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం చేస్తుందని బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావొస్తున్న రాష్ట్రానికి విద్య శాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు ఎందుకు తీసుకువడం లేదని, అసలు ఇంటలిజెన్స్ వ్యవస్థ పనిచేస్తుందా లేదా అనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. నకిరేకల్‌లో పరీక్షలు ప్రారంభమైన తొలి రోజే తెలుగు ప్రశ్నాపత్రం లీకేజీ కావడం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు నిదర్శనమని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పరిపాలనను పక్కకు పెట్టి ప్రతిపక్షాల పైన ప్రతీకార చర్యలు తీసుకోవడానికే పనిచేస్తున్నారని ప్రజా సంక్షేమం పూర్తిగా గాడి తప్పిందని అన్నారు. గడిచిన ఏడాది కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్.సి,ఎస్.టి,బి.సి గురుకులాల్లో చదువుతున్న 68 మంది విద్యార్థులను పొట్టనపెట్టుకున్న పాపం ఈ కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి పరిపాలన చెయ్యడం రాకుంటే తప్పుకోవాలని గాని ప్రశ్నించే ప్రతిపక్షాలపై కేసులు పెట్టడం సరికాదని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక పోరుపై సందిగ్ధం!

- పంచాయతీ ఎన్నికలపై కొనసాగుతున్న సస్పెన్స్
- ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో తెలియని పరిస్థితి
- ఇంకా పెండింగ్‌లోనే గత సర్పంచుల బిల్లులు..
- పోటీకి జంకుతున్న సర్పంచ్ అభ్యర్థులు
- నిధులు వస్తాయనే గ్యారెంటీ లేదని అనుమానాలు
- పోటీకి దూరంగా సీనియర్ నాయకులు..
- కుల గణన సర్వే నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేయనుండడంతో ఆశావహుల్లో ఉత్కంఠ
- దీంతో ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశం లేదనే చర్చ

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. గత ప్రభుత్వం చేసిన అప్పులకు ప్రతినెలా వడ్డీలు కట్టడానికే కోట్లాది రూపాయలు చెల్లించాల్సి వస్తుందని ఓ వైపు ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. మరోవైపు గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు వస్తే పోటీ చేద్దామని ఆశించిన వారికి నిరాశే మిగులుతుంది. గత సర్పంచులకు ఒక్కొక్కరికి దాదాపు 20 నుంచి 50 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయన్న ప్రచారం నేపథ్యంలో ప్రస్తుతం లక్షలు ఖర్చు చేసి పోటీ చేయడానికి అభ్యర్థులు వెనుకంజ వేస్తున్నారన్న టాక్ రాజకీయవర్గాల్లో కొనసాగుతోంది. ఈ క్రమంలో పంచాయతీ ఎన్నికల్లో పోటీకి ముందుకు వస్తారా.. లేక వెనుకంజ వేస్తారా అనే సందిగ్ధం నెలకొంది.

ఇదిగో.. అదిగో అంటూ ఊరిస్తున్న పంచాయతీ ఎన్నికలు..

పంచాయతీల్లో పాలన ముగిసిన 13 నెలలు పూర్తవుతున్నా ఇప్పటికీ గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో పోటీలో ఉంటామని ఆశలు పెట్టుకున్న ఆశావహులు ఆలస్యం అవుతుండడం, ప్రస్తుత పరిస్థితులను బట్టి కాస్త వెనుకంజ వేస్తున్నట్టుగా అర్థమవుతుంది. అంతేకాకుండా గతంలో పనిచేసిన సర్పంచులు ఆయా గ్రామాల్లో చేసిన పనులకు ఇప్పటివరకు బిల్లులు రాకపోవడంతో అప్పుల పాలై ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారు. దీనికి తోడు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఖజానా ఖాళీగా ఉండటంతో రానున్న నూతన పంచాయతీ పాలకవర్గాలకు కూడా నిధులు వచ్చే పరిస్థితి లేకపోవడంతో పోటీకి వెనుకంజ వేయడానికి ఇదో కారణంగా కూడా అనుకుంటున్నారు.

లక్షలాది రూపాయలు వెచ్చించి పోటీ చేసి తీరా గెలిచాక ప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే తమ పరిస్థితి ఏంటి..? అని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఒక్కో సర్పంచ్ సుమారు 20 లక్షల నుంచి కోటి రూపాయల వరకు పనులు చేసి బిల్లుల కోసం కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. బిల్లుల కోసం అధికారులను, ప్రజాప్రతినిధులను అడిగితే ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉందని, ప్రస్తుతం బిల్లులు ఇచ్చే పరిస్థితి లేదని ముఖం ముందే చెబుతుండడంతో మాజీ సర్పంచులు ఆందోళన చెందుతున్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని రానున్న పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి చాలామంది వెనకడుగు వేస్తున్నట్లుగా తెలుస్తోంది.

నిధులు లేక గ్రామాల్లో పడకేసిన పాలన...

గ్రామ పంచాయతీల్లో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజల దరికి చేర్చడంలో ముందుండే సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు లేకపోవడంతో గ్రామాల్లో పాలన పడకేసింది. ప్రజలు ఏదైనా తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలంటే స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధుల అవసరం చాలా ఉంటుంది. అయితే వార్డు సభ్యుల నుంచి మొదలుకొని జడ్పీ చైర్మన్ వరకు కూడా ఎవరు ప్రజాప్రతినిధులు లేకపోవడంతో వారు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పట్టించుకునే వారు లేరని ఆవేదన..

పంచాయతీ ఎన్నికల్లో పోటీ విషయం పక్కన పెడితే అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు క్యాడర్ కు దూరంగా ఉంటున్నారని కార్యకర్తలు ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు తీవ్ర వేదనకు గురవుతున్నారన్న ప్రచారం సాగుతోంది. గత ఎన్నికల్లో ఓటమి పాలైన బీఆర్ఎస్ కార్యకర్తలు పార్టీని విడిచి వెళ్లలేదు. అయినా వారిని ఏకతాటిపైకి తెచ్చి దూరం కాకుండా చేసుకోవడంలో ముఖ్య నాయకులు విఫలమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీలో కూడా ఇదే పరిస్థితి ఉందని, బయటకు చెప్పుకోలేని స్థితిలో ఉన్నామని కిందిస్థాయి క్యాడర్ చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలో ధైర్యంగా పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయలేని పరిస్థితి ఉందన్న భావన కిందిస్థాయి క్యాడర్‌లో ప్రచారం సాగుతోంది.

అభివృద్ధికి నిధులు వచ్చేనా..

ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఖజానా ఖాళీగా ఉండటంతో రానున్న పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన ప్పటికీ గ్రామాల అభివృద్ధికి నిధులు వస్తాయో... రావో.. అనే సందిగ్ధంలో ఆశావాహులు ఉన్నారు. పోటీ చేసి గెలుపొందాక తీరా ప్రభుత్వం నుంచి నిధులు రాకపోతే ప్రజల వద్ద తమ పరిస్థితి ఏమిటని చర్చించుకుంటున్నారు. ఇప్పుడున్న పరిస్థితులే ప్రభుత్వం వద్ద ఉంటే నిధులు వస్తాయనే గ్యారంటీ లేదని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే పంచాయతీల్లో పోటీ చేయాలనే తపనతో కొంత మంది ఇటీవల సేవా కార్యక్రమాలతో పాటు గ్రామాల్లో క్రీడా కిట్లు, నిత్యావసర సరుకు లు పంపిణీ చేసి మెప్పుపొందేందుకు పడరానిపాట్లుపడ్డారు.

ప్రమాదవశాత్తు

బావిలోపడి బాలుడి మృతి

ఇచ్చోడ, మార్చి 27 (ప్రభాత సమాచారం)

మండలంలోని సర్పాపూర్ గ్రామంలో 12ఏళ్ల బాలుడు కాలకృత్యాలు తీర్చడానికని వెళ్లి వ్యవసాయ బావిలో కాలుజారి పడి కానరాని లోకాలకు వెళ్లినా సంఘటన ఓ తల్లికి కడుపు కోత మిగిల్చిన సంఘటన సర్పాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గురువారం ఎస్సై తిరుపతి తెలిపిన వివరాలు ప్రకారం బోథ్ మండలం సాకేరా గ్రామానికి చెంది గుడిసె సునీత తన కుమారుడు ధనుష్ (12)తో తోట్ల ఫంక్షన్‌కి సర్పాపూర్ గ్రామంలోని చెల్లి రాయికంటి నాగమ్మ ఇంటికి కుమా రుడితో బుధవారం సాయంత్రం వచ్చారు. గురువారం 9:30 గంటల ప్రాంతంలో కాలకృత్యాలకని అతని మిత్రులతో కలిసి మారుతీ వ్యవసాయ క్షేత్రంలోని బావి దగ్గరకు వెళ్ళారు. అనుకోకుండా కాలుజారి బావిలో పడగా ఈత రాక పోవడంతో బావిలో మునిగిపోయాడు. వెంటనే అతని స్నేహితుడు గణేష్ చూడగానే పరిగెత్తుకుంటూ వెళ్లి తల్లికి, గ్రామస్తులకు తెలియజేయగా అందరు బావి దగ్గరకు వెళ్లి చూడగా అక్కడ ఉన్న శివ, గణానాన్ బావిలోకి దిగి బాలుడిని బయటకి తీయగా ఎంత మాట్లాడించిన మాట్లాడాక పోయేసరికి చనిపోయినట్టు గుర్తించిన్నట్లు పోలీసులు తెలిపా రు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ తిరుపతి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బెల్లంపల్లి, మార్చి 27 (ప్రభాత సమాచారం)

పట్టణంలోని హనుమాన్ బస్తీకి చెందిన మంతెన శివకుమార్ (30) అనే వ్యక్తి గురువారం ఉదయం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు వన్ టౌన్ ఎస్సై రాకేష్ తెలిపారు. మృతునికి 8 ఏళ్ల కిందట ప్రేమ వివాహం జరిగిందని, ఆరు నెలల కిందట భార్య మరో పెళ్లి చేసుకుని వెళ్లిపోయిందని తెలిపారు. హైదరాబాదులో క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్న క్రమంలో రోడ్డు యాక్సిడెంట్‌లో ఎడమకాలు విరగడంతో డ్రైవర్ ఉద్యోగం చేయ లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు ఎస్సై రాకేష్ తెలిపారు. ఒంటరితనంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసు కున్నట్లు చెప్పారు. మృతుని తల్లి రమక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాకేష్ చెప్పారు.

బోథ్‌లో ప్రైవేట్ క్లినిక్ సీజ్

బోథ్, మార్చి 27 (ప్రభాత సమాచారం)

నియోజకవర్గంలోని పలు మండలాలలో డిఈ ఎంఓ రవిశంకర్ ఆధ్వర్యంలో గురువారం ప్రైవేటు క్లినిక్‌లను తనిఖీ చేసి పలు క్లినిక్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థాయికి మించి వైద్యం చేస్తున్నారని బోథ్‌లో ఒక క్లినిక్ మరియు సోనాలలో ఒక క్లినిక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా మండలాలలోని పలు ల్యాబ్‌లను కూడా తనిఖీ చేసి నేరడిగొండలో రెండు ల్యాబ్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. రిజిస్టర్ కానీ ల్యాబ్ యజమానులు, ప్రాక్టీ షనర్‌లు వెంటనే డిఎంహెచ్ఓ కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. వారి వెంట జిల్లా బోధనా అధికారి వెంకట్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కొంత మంది వైద్యులు ఇష్టారీతిన యాంటీబయోటిక్స్‌ను ఇస్తు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్, మార్చి 27 (ప్రభాత సమాచారం)

కోర్టు ప్రాంగణంలోని ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా డేవిడ్, సహాయ ఎన్నికల అధికారులుగా ఎండీ అబ్దుల్లాఖాన్, వై.వినోద్ రెడ్డి వ్యవహరించారు. ఉదయం ఎన్నికలు నిర్వహించి సాయంత్రం ఫలితాలు ప్రకటించారు. అధ్యక్షునిగా ఎన్రాల నగేశ్ వరుసగా నాలుగోసారి విజయం సాధించారు. 166 ఓట్లకు 160 పోల్ కాగా, ఎన్రాల నగేశ్కు 82, పీ మోహన్సింగ్ 74 ఓట్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శిగా డీఎస్పీ శర్మకు 97 ఓట్లు రాగా, ఎంబడి సంతోష్కుమార్కు 58 ఓట్లు వచ్చాయి. ఉపాధ్యక్షునిగా పోటీ చేసిన టీ చందుసింగు 98 ఓట్లు , అబ్దుల్ కలీంకు 59 ఓట్లు వచ్చాయి. జాయింట్ సెక్రటరీగా మంగేశ్ దేవుతాడే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా రమణయ్య, క్రీడల కార్యదర్శిగా ముజాయిద్ హుస్సేన్, గ్రంథాలయ కార్యదర్శిగా అఖిలేశ్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని బార్ అసోసియేషన్ సభ్యులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంబురాలు చేసుకున్నారు.

డీలిమిటేషన్‌పై తప్పుదోవ పట్టిస్తున్నారు

అసెంబ్లీలో ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్, మార్చి 27 (ప్రభాత సమాచారం)

డిలిమిటేషన్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పోరాటం చేస్తామని అంటున్నాయనీ ఇప్పుడు కొత్తగా కలవడం ఏంటని బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎప్పుడో కలిసిపోయా యని వ్యాఖ్యానించారు. ఇటీవల చెన్నైలో ఇరు పార్టీలు వెళ్లి స్టాలిన్ వీపు గోకి వచ్చారని సెటైర్లు వేశారు. స్టాలిను వీపు దురద పెట్టడా నికి కారణం ఉన్నదన్నారు. వచ్చే కొద్ది రోజుల్లో అక్కడ అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయనే స్టాలిన్ డీలిమిటేషన్‌పై చర్చ పెట్టారన్నారు. కానీ మన రాష్ట్రంలో ఎన్నో సమస్యలు ఉంటే ఇక్కడ పని చేయడం మానేసి స్టాలిన్ వీపు గోకడానికి వెళ్ళారని మండిపడ్డారు. డీ లిమిటేషన్ ఎవరికీ తెలియ కుండా ఏమైనా చాటుగా చేస్తారా అని ప్రశ్నిం చారు. వారిపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతని పక్క దారి పట్టించేందుకు మోడీ పై విషం చిమ్మే ప్ర యత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అసలు ప్రధాని, హోం మంత్రి, కేంద్ర మంత్రులు నియోజక వర్గాల పునర్విభజనపై ఎటువంటి చర్చ చేయలేదని స్పష్టం చేశారు. దేశంలో ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే విధంగా కేంద్రం చట్టాలు చేస్తున్నదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ప్రజల దృష్టి మరలించడానికి అసెంబ్లీలో నియోజకవర్గాల పునర్విభజనపై బిల్లు పెట్టారని ఆరోపించారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రెండు ఒక్కటేనని ఆయన విమర్శించారు. బీజేపీకి దేశంలోని అన్ని ప్రాంతాలు సమానమేనన్న పాయల్ శంకర్ ఎక్కడా కూడా ఎలాంటి నష్టం ఉండబోదని కేంద్ర మంత్రులు బహిరంగంగా చెబుతున్నా వినిపించుకోవడం లేదని గుర్తు చేశారు. జిల్లాలను విభజించిన విషయం బీఆర్ఎస్ మరిచి పోయి వ్యవహరిస్తుందని చురకరలంటించారు. సీఎం ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని బీజేపీ ఎమ్మెల్యేలు వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గాల పునర్విభజనపై బిల్లు పెట్టిమాట్లాడే అవకాశం ఇవ్వలేదని, తమిళనాడులో స్టాలిన్‌పై వ్యతిరేకత మొదలైందని. అందుకే బీజేపీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

మాజీ సర్పంచుల అరెస్టు

జన్నారం, మార్చి 27 (ప్రభాత సమాచారం)

తమ పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న జన్నారం మండల సర్పంచులను, గురువారం ఉదయం జన్నారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్ సంతోశ్, రవి ఉన్నారు.

కోటి మంది ఖాతాదారులకు సేవలు

కాసిపేట, మార్చి 27 (ప్రభాత సమాచారం)

తెలంగాణ వ్యాప్తంగా కోటి మంది బ్యాంకు ఖాతాదారులకు సేవలు అందిస్తున్నామని టీజీబీ చైర్పర్సన్ శోభ అన్నారు. గురువారం భీమారం, కాసిపేట మండలం కొండపూర్ యాపలో బ్యాంకు బ్రాంచీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలు అందించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వివిధ రకాల రుణాలు అందిస్తున్నామని, ఫిక్స్డ్ డిపాజిట్లపై అన్ని బ్యాంకుల కన్నా అధికంగా వడ్డీ ఇస్తున్నామని తెలిపారు. మంచిర్యాల రీజనల్ మేనేజర్ మురళీధర్ రావు, చీఫ్ మేనేజర్ రవి కిషోర్, బ్రాంచి మేనేజర్ సతీష్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా శివకుమార్

- ఉపాధ్యక్షులుగా గజం అనిల్ కుమార్..
- జనరల్ సెక్రటరీగా చేను రవికుమార్ విజయం..

బెల్లంపల్లి, మార్చి 27 (ప్రభాత సమాచారం)

బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు పరిధిలోని బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం రసవత్తరంగా జరిగాయి. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం ఐదు గంటల వరకు కొన సాగాయి. ఈ ఎన్నికలలో మొత్తం 46 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకొని పోటీలో నిలిచిన అభ్యర్థులకు మద్దతు పలికారు. అధ్యక్ష పదవిలో పోటీపడిన న్యాయవాది అంకం రవి కుమార్ తన ప్రత్యర్థి అభ్యర్థి సింగతి రాజేష్ పై 4 ఓట్ల తేడాతో గెలుపొందారు. వీరి ఎన్నికల లో రెండు ఓట్లు చెల్లని ఓట్లుగా గుర్తించారు. ఉపాధ్యక్షులుగా పోటీ చేసిన గజం అనిల్ కుమార్ 33 ఓట్లు సాధించి తన ప్రత్యర్థి దాసారపు రాజు పై గెలుపొందారు. జనరల్ సెక్రటరీగా పోటీ చేసిన చేను రవికుమార్ 27 ఓట్లు సాధించి తన ప్రత్యర్థి కనుకుంట్ల రాజేష్ పై 11 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పోటీ చేసిన టి.దేవరాజుకుమార్ కు 27 ఓట్లు, ఎండి. జుబేర్ కు 37 ఓట్లు, అద్దూరి ప్రతాప్ కు 36 ఓట్లు, శ్రీనివాస్‌కు 29 ఓట్లు వచ్చాయి. ఎగ్జిక్యూటివ్ మెంబర్లకు నిర్వహించిన ఎన్నికలలో 6 ఓట్లు నోటా కు పడగా,1 ఓటు చెల్లని ఓటుగా గుర్తించారు. 27 ఓట్లు వచ్చిన దేవరాజ్ కుమార్ ఓటమిపాలైనట్లు ప్రకటించారు. న్యాయవాదులు ఉట్ల కుమార్ (ట్రెజరర్),ఎస్. సునీల్ కుమార్ (జాయింట్ సెక్రటరీ), నల్లుల సంగీత (లైబ్రేరియన్) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బార్ సోసియేషన్ ఎలక్షన్ ఆఫీసర్ దాట్ల సతీష్ తెలిపారు.

ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాపర్తి రవీందర్

ఆసిఫాబాద్, మార్చి 27 (ప్రభాత సమాచారం)

అసిఫాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాపర్తి రవీందర్ ఎన్నికయ్యారు. గురువారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో బోనగిరి సతీష్ బాబుపై రవీందర్ గెలుపొందారు. వరుసగా రెండోసారి అధ్యక్షుడిగా గెలుపొందడంతో పలువురు న్యాయవాదులు అభినందించారు. దీంతో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చంద్రకుమార్, ప్రధాన కార్యదర్శిగా చరణ్, సంయుక్త కార్యదర్శిగా నగేష్, కోశాధికారిగా రామకృష్ణ, గ్రంథాలయ కార్యదర్శిగా కుమారం లాల్షా, మహిళ ప్రతినిధులుగా గాయత్రి, మధురిమ, క్రీడా సాంస్కృతిక కార్యదర్శిగా కిషోర్ కుమార్ ను ఎన్నుకున్నారు. ఎన్నికల పర్యవేక్షకులుగా జైన్, రవీందర్ వ్యవహరించారు.

కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన ఎంఈఓ

జన్నారం, మార్చి 27 (ప్రభాత సమాచారం)

మండలంలోని కొత్తపేట(బి)లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఎఫ్ఎల్ఎన్ ఏఎక్స్లెల్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కంప్యూటర్ ల్యాబ్‌ను ఎంఈవో విజయకుమార్ ప్రారంభించారు. వెనుకబడిన విద్యార్థులకు పాఠాలు త్వరగా అర్థం అవ్వడానికి ఏఐ కంప్యూటర్ల ఉపయోగపడుతుందన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మార్చి 27 (ప్రభాత సమాచారం)

జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కింద జిల్లాలో చేపట్టిన సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు 30లోగా పూర్తి చేసి ఎంబీ రికార్డులు సమర్పించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలె క్టర్ దీపక్ తివారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్‌లో కలిసి జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథ కం కింద గ్రామాల్లో మంజూరైన సీసీ రోడ్లు, మురుగు కాలు వల నిర్మాణాలు ఈ నెల 30లోగా పూర్తి చేసి ఎంబీ రికార్డు లు సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పనులను పూర్తి చేసి ప్రజ లకు ఉపయోగపడులా నాణ్యత పాటించే విదంగా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయానికి తాళం

బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచుల నిరసన

కాగజ్‌నగర్, మార్చి 27 (ప్రభాత సమాచారం)

తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ... కాగజ్‌నగర్ ఎంపీడీవో కార్యాలయానికి తాళం వేసి ఆందోళన చేపట్టారు. తమ హయాంలో చేపట్టిన మన ఊరు మన బడి,అంతర్గత రహదారులు, పల్లె ప్రకృతి వనాలు, స్మశాన వాటికల అభివృద్ధి పనులు చేపట్టిన తమకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు నాలుగు కోట్ల రూపాయల బిల్లులు రావాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ అభివృద్ధి పనుల కోసం తమ వ్యక్తిగత ఆస్తులు అమ్మి, అప్పు చేసి నిధులు సమకూర్చుకున్నామని ఇప్పుడు తమకు బిల్లులు చెల్లినట్లయితే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం రెండు వందల కోట్లతో చేపట్టే అందాల పోటీలు ఆపి తమకు రావాల్సిన బిల్లులు చెల్లించాలన్నారు. ప్రభుత్వం స్పందించి బిల్లులు చెల్లించాలని, ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్య నేరం

బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేష్

ఆసిఫాబాద్, మార్చి 27 (ప్రభాత సమాచారం)

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం అని బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేష్ అన్నారు. గురువారం కెరామెరి మండలం ఈసాపూర్ గ్రామంలో మైనర్ అమ్మాయికి వివాహం జరుగుతున్నట్లు ఒక్క సమాచారం మేరకు గురువారం బాలల సంరక్షణ, సఖీ కార్యాలయ అధికార బృందం గ్రామాన్ని సందర్శించి మైనర్ బాలిక కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా బూర్ల మహేష్ మాట్లాడుతూ... బాల్యవి వాహాలు చేయడం ద్వారా అనేక ఆరోగ్య సమ స్యలు తలెత్తుతాయన్నారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహం చేయాలని లేనిపక్షంలో బాల్య వివాహ నిషేధ చట్టం 2006 ప్రకారం కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటమన్నారు. మైనర్ అమ్మాయిని తాత్కాలిక వసతిపై సఖి కేంద్రానికి తరలించారు. ఈ కార్యక్రమంలో సఖీ సిఏ సమత సిబ్బంది సుమలత, ప్రవీణ్ కుమార్, ఝాన్సీ రాణి, వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

సమైక్య గ్రామాల నూతన కార్యవర్గం

జన్నారం, మార్చి 27 (ప్రభాత సమాచారం)

తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఉమ్మడి గ్రామాలు అయినటువంటి జన్నారం పొన్కల్ అక్కపెల్లి గూడెం గ్రామాలను ఐక్యం చేస్తూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం జరిగిందని ఆ గ్రామాల వ్యవస్థాపకులు ఎరుకల రాజుగౌడ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు మహ్మద్ అలీం తెలియజేశారు. గౌరవ అధ్యక్షులుగా గొల్లపెల్లి చంద్రమౌళి గౌడ్ అద్యక్షులుగా తాల్లపెల్లి రాజేష్, ఇంచార్జి గా హైమద్ పాషా ఉపాధ్యక్షులు మహ్మద్ సమీర్, కట్లకుంట గంగన్న వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేమ్ సాగర్, శేఖర్ సింహరాజు దుమల్ల లింగన్న ప్రధాన కార్యదర్శి బద్దపురం శివరామకృష్ణ, గట్ల చందూ మణికంఠ ప్రచార కార్యదర్శి జునూగూరి లక్ష్మణ్, హబీబ్, కార్యదర్శి కలీమ్, కట్లకుంట సురేష్, రాసమల్ల అశోక్, కోశాధికారి మర్రిపెల్లి అంజయ్య, అధికార ప్రతినిధి కిరణ్ సింహరాజు, మేడిషెట్టి రవికుమార్ సోషల్ మీడియా ఇన్చార్జి సాదిక్ గుండారపు రాజేష్, ముఖ్య సలహాదారులు బొయిని శేఖర్, బట్టల రాకేష్ గౌడ్, బొంతల లక్ష్మణ్, సలహాదారులుగా జిలకర పోషన్న, బుర్రగడ్డ వెంకటేష్ సాదిక్ బాబా, కార్యవర్గ సభ్యులు

ఉప్పు వేణు కొండ గోపాల్ గుండా ప్రశాంత్ ముత్తంగి మహేశ్ షకీర్‌నీ నియమిచినందుకు అ గ్రామ ఉద్యమ నాయకులు మాట్లాడుతూ గత ఐదు సంవ్సరాలుగా గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం పోరాడుతూ యెన్నో సేవా కార్యక్రమల్లో ముందు ఉంటూ వస్తున్నా వారికి ఈయొక్క పదవులు దక్కడం అనేది వారికి అరుదైన గౌరవంగా భావిస్తున్నాన్నారు.

పాఠకులకు సదుపాయాలు కల్పించాలి

తాండూర్, మార్చి 27 (ప్రభాత సమాచారం)

గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు అన్ని సదుపాయాలు కల్పించాలని గ్రంథాలయం శాఖ కార్యదర్శి సరిత అన్నారు. తాండూర్ గ్రంథాలయాన్ని గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రంథాలయం పరిసరాలు, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయంలో సరిపడ ఫ్యాన్స్, లైట్స్ ఏర్పాటు చేయాలని లైబ్రేరియన్ రామారావుకు ఆమె సూచించారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే నిరుద్యోగ యువతకు అవసరమయ్యే పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన భండాగారాలని, అందరూ సద్వినియం చేసుకోవాలని ఆమె కోరారు. ఆమె వెంట రిటైర్ గ్రంథాలయ అధికారి గజ్జల రమేష్ స్వీపర్ స్వామి ఉన్నారు.

పెండింగ్ బిల్లులు అడిగితే అరెస్టు చేయడం అన్యాయం

లోకేశ్వరం, మార్చి 27 (ప్రభాత సమాచారం)

గ్రామాభివృద్ధి కోసం చేపట్టిన అభివృద్ధి పనులకు చెల్లించాల్సిన బకాయిల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం అన్యాయమని మాజీ సర్పంచులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ ఆందోళనను గాంధేయ మార్గంలో చేస్తున్నా గాని పోలీసులు అరెస్టు చేయడం సబబుకాదన్నారు. మాజీ సర్పంచులు భుజంగ్ రావు, కపిల్, సాయన్న, దిగంబర్ ఉన్నారు. అప్పులు చేసి గ్రామాలలో అనేక పనులు చేసి తిప్పలు పడుతున్న మాజీలు అనేకమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కాబోయే భార్యను లైన్‌లో పెట్టి.. ప్రేయసికి ఫోన్ చేసి..!

ఆదిలాబాద్, మార్చి 27 (ప్రభాత సమాచారం)

ఆదిలాబాద్ జిల్లాలోని ఓ మండలానికి చెందిన యువకుడికి పక్క మండలానికి చెందిన యువతితో నిశ్చితార్థం అయింది. అయితే అతడికి ప్రియురాలు కూడా ఉంది. ఈ క్రమంలో ప్రియురాలితో మాట్లాడుతుండగా పెళ్లి చేసుకునే అమ్మాయి కాల్ చేసింది. లవర్ కాల్ హోల్డ్‌లో పెట్టి కాబోయే భార్య కాల్ లిఫ్ట్ చేశాడు. బైక్‌పై ఉన్నానని, కాల్ చేస్తానని చెప్పి కాల్‌కట్ చేస్తుండగా.. మెర్జ్ అయింది. దీంతో అతడి బాగోతం భయపడింది.

కబడ్డీ, ఖోఖోలో విద్యార్థుల ప్రతిభ

ఆసిఫాబాద్, మార్చి 27 (ప్రభాత సమాచారం)

జిల్లా కేంద్రంలో మాజీ జెడ్పిటిసి అరిగేలా నాగేశ్వర రావు, మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఎంపీపీ కప్ క్రీడా పోటల్లో మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినిలు జూనియర్ విభాగంలోని ఖోఖో, కబడ్డీ క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. పాఠశాల ప్రిన్సిపాల్ రత్నాబాయి విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉత్సాహం ఉన్న విద్యార్థులను క్రీడల పట్ల ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టుల భర్తీ కోసం
దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాల జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా॥హరీష్ రాజ్

మంచిర్యాల, మార్చి 27 (ప్రభాత సమాచారం)

జాతీయ ఆరోగ్య మిషన్ క్రింద పోస్టుల భర్తీ కొరకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా॥హరీష్ రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బస్తీ దవాఖానాల యందు మెడికల్ ఆఫీసర్ (1), స్టాఫ్ నర్స్ (1), సహాయ సిబ్బంది (2), చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలోని ఎన్.సి.డి. విభాగం నందు స్టాఫ్ నర్స్ (1) పోస్టులు భర్తీ చేయడం జరుగుతుందని, అర్హులైన అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ నుండి ఏప్రిల్ 3వ తేదీ వరకు కార్యాలయ పనివేళలలో ఉదయం 10.30 గం౦ఎల నుండి సాయంత్రం 5 గం?ల లోపు జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమర్పించాలని, వివరాలను జిల్లా అధికారిక వెబ్ సైట్ https://mancherial.telangana.gov.inలో సంప్రదించాలని తెలిపారు.

జిల్లా సమస్యలపై అసెంబ్లీలో
ప్రస్తావించిన ఎమ్మెల్యేలు

ఇచ్చోడ, మార్చి 27 (ప్రభాత సమాచారం)

అడెల్లి రోడ్డు పనుల గురించి గురువారం అసెంబ్లీలో జరిగిన క్వశ్చన్ హావర్ లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోథ్ అడెల్లి రోడ్డు కోసం గత ప్రభుత్వం 18 కోట్లు మంజూరు చేసిందని ఇంకా 4 కోట్ల రూపాయలు అవసరం ఉన్నాయని ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని, ఇచ్చోడలో షాదీఖానా నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపించడం జరిగిందని ప్రభుత్వం రంజాన్ మాసాన్ని దృష్టిలో పెట్టుకొని తక్షణమే షాదీఖాన మంజూరు చేయాలని కోరారు.

పిప్రి లిఫ్ట్ ఇరిగేషకు నిధులు విడుదల చేయాలి

ముథోల్, మార్చి 27 (ప్రభాత సమాచారం)

పిప్రి లిఫ్ట్ ఇరిగేషన్‌కు అదనంగా 18 కోట్ల రూపాయల నిధులు ఇవ్వాలని అసెంబ్లీ సమావేశంలో భాగంగా ఎమ్మెల్యే పవర్ రామరావ్ పటేల్ శాస నసభలో కోరారు. పనులు పూర్తయితే 4200 ఎకరా లకు సాగునీరు అందుతుందని, పిప్రి, మొల, నగర్, ధర్మోరా, బాగాపూర్, రాయపూర్ కాండ్లి, లోకేశ్వరం, నగర్ తండాలతో పాటు, పలు తండాల్లో, సాగునీరు అందుతుందన్నారు. సాగునీరు అందుతుందన్నారు. ఈ విషయంలో సంబంధిత మంత్రి సానుకూలంగా స్పందించారు.

నేరాల నియంత్రణకే గ్రామాల్లో కార్డన్ సెర్చ్

చెన్నూర్, మార్చి 27 (ప్రభాత సమాచారం)

నేరాలు నియంత్రిస్తూ ప్రజలకు రక్షణ కల్పించడం కోసమే కార్డన్ సెర్చ్ ఉద్దేశమని పట్టణ సీఐ దేవేందర్ రావు అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని పొక్కురు గ్రామంలో సీఐ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద గ్రామ ప్రజలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ యువత కష్టపడి చదువుకొని తల్లిదండ్రుల కలలు సహకారమయ్యే దిశగా పయనించాలని, యు వత జూదం, నాటుసారా, గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. గ్రామంలో ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. గ్రామంలోని ప్రధాన కూడలిలా వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు అనుమానితుల ఇళ్లను సోదా చేయగా బెల్లం పానకము, గుడుంబా, బెల్లం తో పాటు సరైన పత్రాలు లేని 50 ద్విచక్ర వాహనాలను స్వాధీన పరుచుకున్నట్లు అయినా తెలిపారు. చెన్నూరు పట్టణంలోని కొంతమంది వ్యాపారస్తులు ఎటువంటి అనుమతులు లేకుండా బెల్లం వ్యాపారం చేస్తూ గ్రామాలకు తరలిస్తున్నారని వారి పై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మా తల్లిదండ్రుల నుంచి నాకు ప్రాణహాని ఉంది

నాగసాధుతో కలిసి పోలీసులకు శ్రీవర్షిణి ఫిర్యాదు

బెల్లంపల్లి, మార్చి 27 (ప్రభాత సమాచారం)

మంచిర్యాల జిల్లా నెన్నెల పోలీస్ స్టేషన్‌లో కృష్ణపల్లి గ్రామానికి చెందిన అఘోరీ నాగసాధుతో కలిసి మంగళగిరి (ఆంధ్రప్రదేశ్) కు చెందిన శ్రీవర్షిణి ఫిర్యాదు చేసింది. తన తల్లిదండ్రులు, కేర్ టేకర్ విష్ణుతో తమకు ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను ఇష్టపూర్వకంగా అఘోరీ నాగసాధువుతో కలిసి ఉన్నానని పేర్కొన్నారు. గత రెండు రోజుల కిందట మంగళగిరి నుంచి అఘోరి నాగసాధుతో కలిసి కృష్ణపల్లికి కారులో వచ్చిన ఆమె తిరిగి వెళుతూ ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

మెరుగైన వైద్య సేవలందించాలి

ముజ్గి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, మార్చి 27 (ప్రభాత సమాచారం)

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం నిర్మల్ గ్రామీణ మండలం ముజ్గి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నీ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బయోమెట్రిక్ హాజరు, ఇన్ పెషేంట్ వార్డు, ఆయుష్ క్లినిక్, డ్రగ్స్ స్టోరూంలను సందర్శించి, రిజిస్టర్లను పరిశీలించారు. అందిస్తున్న వైద్య సేవలు, రోగులకు లభిస్తున్న సదుపాయాలపై వైద్యులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ఆదేశించారు. వైద్యం కోసం వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించాలని, ఆసుపత్రుల్లో సరిపడినన్ని బెడ్లు, మందులు, ఇతర వైద్య పరికరాలు అందుబాటులో ఉండాలని సూచించారు. అందిస్తున్న వైద్యచికిత్సలు, మందులను రోజువారీగా రిజిస్టర్‌లలో నమోదు చేయాలన్నారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలనను పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆసుపత్రిలో నిరంతరం పరిశుభ్రతను పాటించాలని, ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అనంతరం చికిత్స కోసం వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడుతూ, ఆసుపత్రిలోని సౌకర్యాలు, అందిస్తున్న చికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ రాజేందర్, వైద్యశాఖ అధికారులు శ్రీనివాస్, రవీందర్, తహసీల్దార్ సంతోష్, ఎంపిడిఓ గజానంద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వాంకిడిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

వాంకిడి, మార్చి 27 (ప్రభాత సమాచారం)

వాంకిడి మండల కేంద్రంలోని పెరుకవాడ, మండోకార్ వాడ గ్రామస్థులు తాగు నీటికి అనేక ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి యెలగతి సుచిత్ ఆరోపించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిషన్ భగీరథ నల్లాలు ఉన్నా ప్రజలకు మంచినీరు అందడం లేదని ఆరోపించారు. మిషన్ భగీరథ ఏఈ శైలేందర్ కు ఎన్నోసార్లు చెప్పిన పట్టించుకోవడంలేదని వాపోయారు. సమస్యను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు తాగునీరు అందించాలని లేనిపక్షంలో ఖాళీ బిందెలతో ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన తెలుపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా మండల అధ్యక్షుడు వికాస్, ఉపాధ్యక్షుడు సాయి, అక్షయ్ ఉన్నారు.

బ్లేడ్‌తో గొంతు కోసుకొని ఒకరి ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్, మార్చి 27 (ప్రభాత సమాచారం)

ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. కే.ఆర్.కే కాలనీకి చెందిన నితిన్ అనే వ్యక్తి పట్టణంలోని మసూద్ చౌక్ సమీపంలో బ్లేడ్ తో గొంతు కోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే స్థానికులు రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్, ఎస్ఐ అశోక్ లు రిమ్స్ కు చేరుకొని సంఘటనపై ఆరా తీస్తున్నారు. అయితే కుటుంబ కలహాలే కారణమని ప్రాథమిక సమాచారం.

ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం

ఉట్నూర్, మార్చి 27 (ప్రభాత సమాచారం)

ఉట్నూర్ ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతూ మనస్థాపం చెంది ఒకరు మృతి చెందారు. వివరాలు ఇలా.. మండలంలోని శ్యాంపూర్ గ్రామానికి చెందిన బాబు (47) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు భార్యకి కుష్టు వ్యాధితో బాధపడుతుంది. దీనికి తోడు మృతునికి అనారోగ్యంతో బాధపడుతున్నడు. కూలీ పనులు జీవనం చేసుకుంటూ కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులతో కొన్ని రోజులుగా తీవ్ర మనస్తాపంతో ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భర్త మృతి చెందడంతో భార్య కన్నీరుమున్నీరుగా విలపించడంతో అక్కడ ఉన్నవారిని కంటతడి పెట్టించింది. మృతిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గేరు మార్చేసిన ధన్య..

ధన్య బాలకృష్ణ.. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే.. టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీల్లో ఎన్నో చిత్రాల్లో సహాయ నటిగా కనిపించింది. చాలా కాలంగా తెలుగులో కనిపించలేదు. ఇప్పుడు మరోసారి తెలుగులో సినిమా చేసి మెప్పించనుంది. ధన్య బాలకృష్ణ నటించిన బాపు సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ధన్య బాలకృష్ణ ఎక్కువగా సైడ్ రోల్స్ చేసింది. పేరుకు సైడ్ క్యారెక్టర్ ఆర్టిస్టగా నటించినా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది నటి ధన్య బాలకృష్ణ. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, సాఫ్ట్‌వేర్ సుధీర్ వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుందీ ముందుగుమ్మ. నటన, అందంతో ఆకట్టుకుంటూ మంచి గుర్తింపు సంపాదించుకుంటుంది. వరుస అవకాశాలను సొంతం చేసుకుంటూ దూసుకెళుతోంది. తెలుగులో సాఫ్ట్ వేరు సుధీర్, నేను శైలజ, రాజు గారి గది, కార్బన్ వంటి చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకుంది. అటు వెండితెరపైనే కాకుండా డిజిటల్ ప్లాట్ ఫాంలోనూ పలు వెబ్ సిరీస్ చేస్తూ రాణిస్తోంది. అలాగే సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉంటుంది ఈ చిన్నది తాజాగా దాన్యబాలకృష్ణ ఫోటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ధన్య బాలకృష్ణ ఫోటోల పై నెటిజన్స్ రకరకాల కామెంట్స్ చేస్తున్నారు. హీరోయిన్స్ ను మించిన అందం మీది అంటూ కుర్రాళ్ళు కామెంట్స్ చేస్తున్నారు.

బండ బావమరిది శుభాకాంక్షలు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తేజ్ నేడు తన 40వ పుట్టినరోజుని జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనకు సినీ ప్రముఖులంతా సోషల్ మీడియా వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇప్పటికే మెగాస్టార్ చిరంజీవి చరణ్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపగా.. తాజాగా సాయిధరమ్ తేజ్ చరణ్‌కి స్పెషల్ బర్త్‌డే విషెస్ తెలిపాడు. 'నీ బండ బావమరిది, బండ ప్రేమ తప్ప ఏమి ఇవ్వగలుగుతాడు.. తీసుకో బావ నా ఈ బండ ప్రేమను' అంటూ ఎక్స్ వేదికగా తన బావ చరణ్‌కి బర్త్‌డే శుభాకాంక్షలు తెలిపాడు. కాగా ఇందుకు సంబంధించిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

నితిన్‌కు క్షమాపణలు చెప్పిన ఆది పినిశెట్టి

టాలీవుడ్ యూత్ స్టార్ నితిన్ నటించిన తాజా చిత్రం రాబిన్ హుడ్. ఛలో, భీష్మ చిత్రాలను తెరకెక్కించిన వెంకీ కుడుముల ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఎక్స్‌ట్రార్డీనరి మ్యాన్ తర్వాత నితిన్ తో మరోసారి జత కట్టింది శ్రీలీల. అలాగే ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఈ సినిమాలో క్యామియో రోల్ పోషించనున్నాడు. ఇక కేతిక శర్మ స్పెషల్ సాంగ్ లో సందడి చేసింది. ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న రాబిన్ హుడ్ సినిమా మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో నితిన్ సినిమాకు ఆల్ ది బెస్ట్ చెప్పాడు మరో నటుడు ఆది పిని శెట్టి. అదే సమయంలో ఒక విషయంలో తనను క్షమించాలని నితిన్ ను కోరాడు. ఈ మేరకు ఆది పినిశెట్టి చేసిన ట్వీట్ ఇప్పుడు వైరలవుతోంది. గత నెలలో ఆది పినిశెట్టి హీరోగా నటించిన శబ్దం సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇంటెన్స్ హారర్ థ్రిల్లర్ గా తెరకెక్కిన ఈ సినిమాలో లక్ష్మీ మేనన్ హీరోయిన్ గా నటించింది. ఆకట్టుకునే కథా, కథనాలు, విజువల్స్, బీజీఎమ్ ఇలా శబ్దం సినిమాలో చాలా పాజిటివ్ అంశాలు ఉండడంతో ఆడియెన్స్ ను బాగానే మెప్పించింది. అయితే శబ్దం సినిమా రిలీజ్ టైమ్ లో నితిన్ ఒక ట్వీట్ చేశాడు. ఆది పినిశెట్టితో పాటు శబ్దం మూవీ యూనిట్ కు ఆల్ ది బెస్ట్ చెబుతూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టాడు.

అయితే తన సినిమా ప్రమోషన్ల లో బిజీగా ఉన్న ఆది పినిశెట్టి నితిన్ ట్వీట్ కు రిప్లై ఇవ్వలేకపోయాడట. ఈ క్రమంలోనే నితిన్ సినిమా రాబిన్ హుడ్ సినిమా రిలీజ్ నేపథ్యంలో ఆది పినిశెట్టి ట్వీట్ పెట్టాడు. నితిన్ కు సారీ చెబుతూ రిప్లై ఇచ్చాడు. 'ఇంత లేట్ అయినందుకు సారీ. అప్పుడు శబ్దం సినిమా రిలీజ్ టైమ్ లో ఇష్యూ ఉండడం వల్ల సరిగ్గా స్పందించలేకపోయాను. ఇంత లేటుగా రిప్లై ఇస్తున్నందుకు సారీ' అని ట్వీట్ చేశాడు. అలాగే నితన్ రాబిన్ హుడ్ సినిమా యూనిట్ కు ఆల్ ది బెస్ట్ కూడా చెప్పాడు ఆది పినిశెట్టి. ప్రస్తుతం ఈ ట్వీట్ కూడా నెట్టింట వైరలవుతోంది.

వరుస హిట్స్ తో రష్మిక దూకుడు

- ఒక్కో సినిమాకు రూ.10 కోట్లు
- ఆమె కారు ఖరీదే రూ. 2 కోట్లు

నేషనల్ క్రష్ రష్మిక మందన్నా.. ప్రస్తుతం వరల్డ్ వైడ్ మారుమోగుతున్న పేరు. యానిమల్, పుష్ప 2 సినిమాతో బ్లాక్ బస్టర్స్ అందుకున్న ఈ బ్యూటీ.. ఇటీవలే ఛావా సినిమాతో మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. దీంతో గత రెండేళ్లలో మూడు పాన్ ఇండియా చిత్రాలకు ఏకంగా రూ.3 వేల కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. అంతేకాదు.. ప్రస్తుతం తెలుగుతోపాటు హిందీలోనూ వరుస సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది ఈ అమ్మడు. ఇటీవలే సికందర్ సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చింది. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో సల్మాన్ ఖాన్ నటించిన ఈ మూవీకి మంచి రెస్పాన్స్ వస్తుంది. ఇదిలా ఉంటే.. ఇటీవల ఫోర్బ్స్ నివేదిక రష్మిక సంపాదనను బయటపెట్టింది. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం.. రష్మిక ఆస్తులు రూ.66 కోట్లకు పైగా ఉన్నట్లు సమాచారం. అలాగే ఒక్కో సినిమాకు దాదాపు రూ.10 కోట్ల వరకు వసూలు చేస్తుందట. ఇదిలా ఉంటే.. సాధారణంగా సినీరంగంలో హీరోహీరోయిన్స్ ఖరీదైన స్వాంకీ కార్లలో దిగడం కొందరు బాలీవుడ్ స్టార్లకు సాధ్యం అని భావిస్తాం.. తాజాగా నేషనల్ క్రష్ సైతం ఖరీదైన కారుకు ఓనర్ అయ్యింది. ఇటీవలే ఆమె మెర్సిడెస్ బెంజ్ ఎస్ 450ని కొనుగోలు చేసింది. ఈ కారు ధర దాదాపు రూ.2 కోట్లకు పైగా ఉంటుందని టాక్. నిజానికి సినీతారలకు ఆటోమొబైల్స్ పట్ల ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. చాలా మంది తారలు రోల్స్ రాయిస్, లంబోర్గినీ, మే బ్యాక్ వంటి ఖరీదైన కార్లలో సందడి చేస్తుంటారు. ఇక ఇప్పుడు రష్మిక సైతం లగ్జరీ కారులో షికారు చేస్తూ ఎక్కడా తగ్గడం లేదు. ప్రస్తుతం రష్మిక గ్యారేజీలో 5 రకాల లగ్జరీ బ్రాండ్ కార్లు ఉన్నాయి. ఈ కార్ల కోసం కోట్లాది రూపాయలను వెచ్చిస్తోంది.

నడుము అందాలతో హీటెక్కిస్తున్న ప్రియాంక చొప్రా

ప్రియాంక చొప్రా ఇప్పుడు ఫుల్ స్వింగ్ లో ఉంది. మొదటిసారి ఆమె తెలుగులో నటిస్తోంది. రాజమౌళి డైరెక్షన్ లో మహేశ్ బాబు హీరోగా వస్తున్న సినిమాలో ఆమె యాక్ట్ చేస్తోంది. అంతకు ముందే ఆమెకు దేశ వ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. అటు హాలీవుడ్ లో కూడా చాలా సినిమాలు చేసింది. చాలా దేశాల్లో ఆమెకు అభిమానులు ఉన్నారు. ఆమెకు ఉన్న క్రేజ్ ను దృష్టిలో పెట్టుకుని ఆమెకు రాజమౌళి సినిమాలో అవకాశం ఇచ్చారు. మొన్నటి దాకా ఆమె ఒడిశా షూటింగ్ లో పాల్గొంది. ఇప్పుడు మళ్లీ అమెరికాకు వెళ్లిపోయింది. అయితే అమెరికాలో ఉంటున్నా సరే ఆమె సోషల్ మీడియాలో తన ఫ్యాన్స్ ను ఎప్పటికప్పుడు పలకరిస్తూనే ఉంటుంది. తన ఘాటు అందాలతో కుర్రకారును వేడెక్కిస్తోంది. తాజాగా మరోసారి రెచ్చిపోయింది ఈ బ్యూటీ. ఇందులో జీన్, బ్రా వేసుకుంది. తన నడుము అందాలతో పాటు బ్రా అందాలను కూడా చూపించేస్తోంది. వయసు పెరుగుతున్నా.. పెళ్లి అయి కూతురు పుట్టినా సరే తన ఘాటు అందాలు మాత్రం ఇంచుకూడా తగ్గలేదని ఈ ఫొటోతో మరోసారి నిరూపించేసుకుంది ఈ భామ. ఇందులో యమ హాట్‌గా కనిపిస్తోంది. ఇంకేముంది క్షణాల్లోనే ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయిపోతోంది. ఇది చూసిన ఫ్యాన్స్ అంతా ప్రియాంక ఫొటోకు లైకులు, కామెంట్లు పెట్టేస్తున్నారు. త్వరలోనే ఆమె రాజమౌళి సినిమా షూట్‌లో మళ్లీ జాయిన్ అవుతుందని సమాచారం.

విక్రమ్ సినిమాకు ప్రమోషన్ నిల్

ఆశాజనకంగా లేని కలెక్షన్లు

చియాన్ విక్రమ్ తమిళ హీరో అయిన తెలుగులోను ఆయనకి విపరీతమైన ఫాలోయింగ్ ఉంది. విక్రమ్ సినిమాలని ప్రేక్షకులు ఎంతో ఆదరిస్తుంటారు. అయితే అపరిచితుడు తరువాత మళ్లీ విక్రమ్ ఆ రేంజ్ సక్సెస్ చూడలేకపోతోన్నాడు. ఇటీవల విక్రమ్ చేసిన ప్రయోగాలన్నీ కూడా విఫలం అయ్యాయి. తంగలాన్ అంటూ విచిత్ర ప్రయోగం చేసి చాలా కష్టపడ్డాడు. కాని ఆ సినిమాకి రావల్సినంత గుర్తింపు రాలేదు, మూవీ కూడా సక్సెస్ కాలేదు. అయితే తాజాగా విక్రమ్ హీరోగా అరుణ్ కుమార్ వీర ధీర శూరన్ అనే చిత్రాన్ని తెరకెక్కించారు. తెలుగులో వీర ధీర శూర అనే టైటిల్‌తో వచ్చింది. అయితే ఈ రోజు ఉదయం థియేటర్లలో విడుదల కావలసిన ఈ సినిమాకు ఢిల్లీ హైకోర్టు షాక్ ఇచ్చింది. విడుదలపై మధ్యంతర నిషేధం విధించడంతో ఉదయం 9 గంటలకు



పడాల్సిన షోలు అన్నీ క్యాన్సిల్ అయ్యాయి. 'వీర ధీర శూర పార్ట్ 2' చిత్రాన్ని హెచ్.ఆర్ పిక్చర్స్ పతాకం మీద రియా శిబు ప్రొడ్యూస్ చేయగా, ఈ మూవీ రిలీజ్ మీద స్టే కోరుతూ ముంబైకు చెందిన ప్రొడక్షన్ కంపెనీ బీ4యు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. చిత్ర నిర్మాణ సంస్థ తమకు శాటిలైట్ హక్కులను విక్రయించిందని, అయితే ఒప్పందం ప్రకారం విడుదలకు ముందు సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ (ఓటిటి) హక్కులను విక్రయించకూడదు. కాని దానిని ఉల్లంఘిస్తూ నిర్మాత డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్ అమ్మేశారని తమ పిటిషన్ లో పేర్కొంది. దీంతో మూవీ రిలీజ్ మీద మధ్యంతర నిషేదం విధించింది. పివిఆర్, ఐనాక్స్ వంటి మల్టీప్లెక్స్ స్క్రీన్లలో ఉదయం 9 గంటలకు షెడ్యూల్ చేసిన షోలు అన్నిటినీ క్యాన్సిల్ చేశారు. ఓవర్సీస్‌లో షోలు కూడా పడాల్సి ఉంది. కానీ అక్కడ షోలు క్యాన్సిల్ అయ్యాయ్ అని సమాచారం. గురువారం వీరధీరశూర పార్ట్ 2 రిలీజ్ కాగా, బుకింగ్స్ ఏ మాత్రం ఆశాజనకంగా లేవు. ప్రమోషన్లు కూడా అంతగా జరగలేదు. ఒక రోజు విక్రమ్ టీమ్ వచ్చి మీడియాని కలిసి, ప్రెస్ మీట్ పెట్టి ఇంటర్వ్యూలు ఇచ్చి వెళ్లిపోయారు. తమిళంలో కూడా బుకింగ్స్ అంతగా ఏమి లేవు. వీర ధీర శూర సినిమా వస్తున్నట్టుగా మాకు తెలీదే అంటూ కొంత మంది సెటైర్లు కూడా వేస్తున్నారు. ఢిల్లీ హైకోర్టు షాక్ ఇవ్వడానికి ముందు కూడా ఎర్లీ మార్నింగ్ షోస్ టికెట్స్ కొన్నవారే కరువయ్యారు. అసలు విక్రమ్ మూవీకి ఎందుకు ఇలాంటి పరిస్థితి వచ్చింది అని అందరు ముచ్చటించుకుంటున్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న కేంద్ర ప్రభుత్వం

జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో ఖానాపూర్ ఇన్‌చార్జీ రాజేశ్వర్, పోశెట్టి

ఖానాపూర్, మార్చి 27 (ప్రభాత సమాచారం)
గడచిన పది సంవత్సరాల కాలం నుంచి, కేంద్రంలో అధికారంలో ఉన్న, బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా పాలన సాగిస్తుందని, జై బాబు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం ఖానాపూర్ ఇన్చార్జీలు ఏంబటి రాజేశ్వర్, అయ్యన్న గారి పోశెట్టిలు అన్నారు. ఈ మేరకు గురువారం ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో, వారు కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతిజ్ఞ అనంతరం వారు మాట్లాడుతూ... భారతదేశం విపత్కర పరిస్థితి ఎదుర్కొంటుందని, దానిని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిలా సిద్ధపడాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, నిర్మల్ ఇంచార్జ్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజు రా సత్యం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్, ఇప శ్రీనివాస్ రెడ్డి, ఆమంద శ్రీనివాస్, నాయకులు షౌకత్ పాషా, కావలి సంతోష్, నారాయణ రెడ్డి, గంగాధర్, రాజు నాయక్, జంగిలి శంకర్, మడిగల గంగాధర్, లక్ష్మీపతి గౌడ్, రాజేశ్వర్, మధిర సత్యనారాయణ, మీర్జా, సజ్జు, శేషాద్రి, నరసయ్య, రమేష్,

దాసరి రాజన్న, శ్రీనివాస్ నాయక్, నరేష్, ఎడ్ల రాజేందర్, రమాదేవి, తారాబాయి, వసంత తదితరులు ఉన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన ఇద్దరికి జరిమానా

ఆదిలాబాద్, మార్చి 27 (ప్రభాత సమాచారం)
జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆదిలాబాద్ వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన ఇద్దరికి గురువారం ఆదిలాబాద్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుండ రామస్వామి 600 చొప్పున జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా పెట్రోలింగ్ వ్యవస్థను అమలుపరుస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా డయల్ 100కి సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మాజీ సర్పంచ్‌లను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

నర్సాపూర్ (జి), మార్చి 27 (ప్రభాత సమాచారం)
నర్సాపూర్ (జి) మండలంలోని తాజా మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా స్థానిక పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఫోరం మాజీ సర్పంచ్ శీను, గోవింద్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతితో పనులు చేసి, అభివృద్ధి చేసినప్పటికీ ఆ పనులకు సంబంధించిన బిల్లులు సర్పంచులకు చెల్లించపోవడంతో వెంటనే రిలీజ్ చేయాలని, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో నిధులు కేటాయించాలని, అసెంబ్లీ ముట్టడికి బయలుదేరుతుండగా పోలీసులు అరెస్టు చేశారన్నారు.

రాష్ట్ర బీసీ సంఘం నేతను సన్మానించిన నిర్మల్ నాయకులు

నిర్మల్, మార్చి 27 (ప్రభాత సమాచారం)
నిర్మల్ జిల్లా కేంద్రానికి విచ్చేసిన బీసీ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ తిరుపతిని జిల్లా కేంద్రంలో మ్యాన్ పవర్ అండ్ ఔట్సోర్సింగ్ జిల్లా అధ్యక్షుడు కుమార్ కలిసి ఈ సందర్భంగా ఆయనను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. నిర్మల్‌లో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాల గురించి పలు విషయాలు చర్చించారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

బెల్లంపల్లి, మార్చి 27 (ప్రభాత సమాచారం)
బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా గల రైల్వే లైన్‌పై గురువారం మధ్యాహ్నం సిర్పూర్ ప్యాసింజర్ రైలు కిందపడి 40 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. ఎలాంటి ఆధారాలు లభించలేదని రైల్వేహెడ్ కానిస్టేబుల్ కె.సురేష్ గౌడ్ తెలిపారు.

అగ్నివీర్‌కు ఎంపికైన యువకులకు సన్మానం

బోథ్, మార్చి 27 (ప్రభాత సమాచారం)
బోథ్ పట్టణ కేంద్రానికి చెందిన మల్గోతి శివరాజ్,పొస్కంటి ప్రసంజయ్ నేవిలో ఎస్ఎస్ఆర్ ఉద్యోగానికి ఎంపిక అయ్యారు వీరిని మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయం వద్ద మహిళ సంఘం సభ్యుల చేతుల మీదుగా శాలువా తో సన్మానం చేశారు అనంతరం సొసైటీ అధ్యక్షుడు మాసం అనిల్ కుమార్ మాట్లాడుతు యువకుల చేతిలో దేశ భవిష్యత్తు ఉంది అని ప్రతి అవకాశం అందిపుచ్చుకోవాలి అని తెలిపారు వీరు ఇద్దరు మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు చేసే 2కే రన్ లో ప్రథమ ,ద్వితీయ స్థానం లో ఉంటుందే అని వారికి ఉద్యోగం రావడం చాలా సంతోషం అని తెలిపారు. మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ అధ్వర్యంలో యువకులకు ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం మాధవ్ రావు,భజరంగ్దల్ జిల్లా ప్రముఖ్ ఫాలిక్ రమేష్, సురేందర్ పాల్గొన్నారు.

విప్లవోద్యమంలో ఆయన నుంచి.. ఎంతో స్ఫూర్తిని పొందాను

కొత్తగూడ, మార్చి 27 (ప్రభాత సమాచారం)
నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నాను అంటే నా భర్త ఏఎల్టీ వ్యవస్థాపకుడు కంజ రాము నుండి నేర్చుకున్న పాఠాలే నన్ను ముందుకు నడిపిస్తున్నాయని, ఆయనే నాకు స్ఫూర్తి అని మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం ఆదివాసి లిబరేషన్ టైగర్ (ఏఎల్టీ) వ్యవస్థాపకుడు కుంజ రాము కుమారుడు కుంజ సూర్య రాము ఆధ్వర్యంలో కుంజ రాము 20వ వర్ధంతిని నిర్వహించారు. మంత్రి సీతక్క స్మారక స్థూపాన్ని పూలమాలలు వేసి నివాళులు అర్పించి భర్తను తలుచుకొని నిండు సభలో కన్నీటి పర్యంతం అయ్యారు. ప్రజల కోసం పని చేసిన బంధుత్వం ఎప్పటికీ పోదని మంత్రి అన్నారు. అందుకే రాము మరణించి 20 సంవత్సరాలు అవుతున్నా ఆయన జ్ఞాపకాలను మరచిపోకుండా వర్ధంతి సభకు పెద్ద ఎత్తున ఇక్కడికి తరలి వచ్చారు అని అన్నారు. తాను కూడా ఉద్యమంలో ఎప్పుడో చనిపోయేదానినని తృటిలో ఎన్నో ఎన్కౌంటర్ ల నుండి బయటపడ్డానని, ఇది తనకు బోనస్ లైఫ్ ఇదంతా తనకు పునర్జన్మే నని మంత్రి అన్నారు. మిగిలిన జీవితాన్ని ప్రజల కోసం సేవ చేయాలని ప్రజా జీవితంలో ఉన్నాను అని అన్నారు. ఈ జీవితమంతా ప్రజలకి అంకితమని, అందరి సహాయ సహకారాలు తనను బలవంతురాలని చేస్తుందన్నారు. మంత్రిగా ఉన్న ఇదే సిద్ధాంతంతో ముందుకు వెళుతున్నానని అన్నారు. 30 సంవత్సరాలు పరిష్కారం కానీ ఎస్సీ వర్గీకరణను, 100 సంవత్సరాల్లో జరగని బీసీ కులగణన విజయవంతం చేశామన్నారు. అదేవిధంగా ఎస్టీల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అందరూ బాగుండాలి అన్న కుంజా రాము ఆశయాల సాధన కోసం పని చేస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు విప్లవ ఉద్యమ నాయకులు తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచుల అరెస్టు

దిలావర్‌పూర్, మార్చి 27 (ప్రభాత సమాచారం)
పెండింగ్ బిల్లులు చెల్లించాలని అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాజీ సర్పంచులను అరెస్టు చేయడం అక్రమమని నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు వీరేష్ కుమార్ ఆరోపించారు. మాజీ సర్పంచులను గురువారం ఉదయం ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వీరేష్ కుమార్ మాట్లాడుతూ సంవత్సర కాలంగా గ్రామపంచాయతీలో చేసిన పనులకు బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. చేసిన పనులకు బిల్లులు ఇవ్వమని అడగడమే తాము చేసిన నేరమా అని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీ లను అభివృద్ధి చేయాలని లక్ష్యంతో అప్పు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని, కానీ చేసిన పనులకు బిల్లులు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు.

ఒకే దేశం ఒకే ఎన్నిక జరగాలి

వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల

ఆసిఫాబాద్, మార్చి 27 (ప్రభాత సమాచారం)
ఒకే దేశం ఒకే ఎన్నిక జరగాలని వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వరరావు అన్నారు. గురువారం జైనూర్, కెరామేరి, సిర్పూర్ యు, లింగాపూర్ మండలాలలో ఒకే దేశం ఒకే ఎన్నికపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలంతో కలసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దశల వారి ఎన్నికలు నిర్వహించడంతో సమయం వృధా అవ్వడంతో పాటు ఆర్థిక భారం పడుతుందన్న ఉద్దేశంతో బీజేపీ పార్టీ ఒకే దేశం ఒకే ఎన్నిక నిర్వహించాలన్న సంకల్పంతో ప్రజాఅభిప్రాయ సేకరణ చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మండల కన్వీనర్ కరణ్ ఆయా మండలాల కన్వీనర్లు, కో కన్వీనర్లు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి

ఆసిఫాబాద్, మార్చి 27 (ప్రభాత సమాచారం)
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కు ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి డిమాండ్ చేశారు. ఉద్యమ పితామహుడు అప్పారి వెంకటస్వామికి గురువారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు బకాయిపడిన నాలుగు వాయిదాల డీఏను, పీఆర్సీని అడగొద్దని అవి కావా లంటే నెలనెల జీతాలే ఇవ్వలేమని సీఎం ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండి స్తున్నామన్నారు. ఉద్యోగులు గొంతెమ్మ కోర్కెలు కోవడం లేదని న్యాయంగా రావాల్సిన బకాయిలను, వారు దాచుకున్న సొమ్మును తిరిగి చెల్లించాలని మాత్రమే అడుగుతున్నారని అన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు ఇందురావు, రమేష్, హేమంత్, రాజకమలా కర్‌రెడ్డి, సుభాష్, మహిపాల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉగస్య ఆదిః ఉగాదిః

డాక్టర్ కలకుంట్ల రాజేశ్వర్‌రెడ్డి
శ్రీ భువనేశ్వరి శాస్త్రీయ
జ్యోతిష్య పీఠం, సిద్ధిపేట

చైత్రమాసి జగద్బ్రహ్మ
ససర్జ ప్రథమే అహని,
వత్సరాదౌ వసంతాదౌ
రసరాద్యే తథైవచ

అంటే బ్రహ్మకల్పం ప్రారంభమైన మొదటి ఉగాది ప్రభవ. మొదటి ఋతువు వసంతం. నెల చైత్రం... తిథి పాడ్యమి... ఆదివారం. అంటే ఆసమయంలో ఈ సృష్టి ప్రారంభమైందని లేదా ప్రభవించిందని అర్థం. అందుకే తెలుగు సంవత్సరాలలో మొదటిది ప్రభవ. చివరిది క్షయ. క్షయ అంటే నాశనమయ్యేది. ఈ బ్రహ్మకల్పం అంతమయ్యే ఏడాది అన్నమాట. కాబట్టి చైత్రమాసం శుక్లపక్షంలో సూర్యోదయం కాలంలో పాడ్యమి తిథి ఉన్నరోజునే ఉగాదిగా నిర్ణయిస్తారు.

ఉగస్య ఆదిః ఉగాదిః అంటారు. ఉగ అంటే నక్షత్ర గమనం. అంటే నక్షత్ర గమనం ప్రారంభమే ఉగాది అని అర్థం. మానవుల లెక్క ప్రకారం 432,00,00,000 సంవత్సరాలు బ్రహ్మకు ఒక పగలు. రాత్రికూడా అంతే. అంటే 864,00,00,000 సంవత్సరాలు బ్రహ్మకు ఒక రోజున్నమాట. ఇలాంటివి 360 రోజులైతే ఆయనకు ఒక ఏడాది పూర్తయినట్లు లెక్క. అంటే బ్రహ్మ వందేళ్ల ఆయుష్షు మూడు లక్షల పదకొండు వేల నలభై కోట్ల సంవత్సరాలు. ఇప్పటివరకు ఆరుగురు బ్రహ్మలు సృష్టికార్యాలను ముగించారు. ప్రస్తుతం ఏడో బ్రహ్మ ద్వితీయపరార్థంలో ఉన్నాడు. అంటే ఆయన వయసు ప్రస్తుతం 51 ఏళ్లు. ఈ కలియుగం ప్రమాది నామ సంవత్సర చైత్ర శుద్ధ పాడ్యమినాడు ప్రారంభమైంది. ఈ కల్పం ప్రారంభమై 197,29,49,114 ఏళ్లు పూర్తయింది. ఇప్పుడు మనం వైవస్వత మన్వంతరంలోని కలియుగంలో ఉన్నాం. ఇది ప్రారంభమై 5114 సంవత్సరాలైంది. ఉగాది రోజునే బ్రహ్మ సృష్టిని మొదలుపెట్టాడని అంటారు. శ్రీమహావిష్ణువు మత్స్యావతారంలో వేదాలను దొంగతనం చేసిన సోమకుడిని సంహరించి వాటిని బ్రహ్మకు అప్పగించిన రోజుకూడా ఇదేనని ప్రతీతి. శ్రీరాముడు, విక్రమాదిత్యుడు, శాలివాహనుడు పట్టాభిషిక్తుడైన రోజుకూడా ఉగాదే. వరాహమిహిరుడు పంచాగాన్ని జాతికి అంకితం చేసింది కూడా ఈ రోజే.

"ఉగస్య ఆదిః ఉగాదిః" "ఉగ" అంటే నక్షత్ర గమనం లేదా జన్మ ఆయుష్షు అని అర్థాలు కూడా ఉన్నాయి. వీటికి ఆది ఉగాది. అంటే ప్రపంచంలోని జనుల ఆయుష్షుకు మొదటిరోజు కాబట్టి ఉగాదిగా మారింది. యుగం అంటే రెండు లేక జత అని కూడా అర్థం. ఉత్తరాయణ, దక్షిణాయనాలకు ఆయనద్వయ సంయుతం 'యుగం' (సంవత్సరం) కాబట్టి ఆ యుగానికి ఆది యుగాది అయ్యింది. ఉగాదివసంతానికి గల అవినాభావ సంబంధాన్ని సూర్యుడికి సకల ఋతువులకు, ప్రాతః సాయం కాలాది త్రికాలములకు ఉషా మాతృస్వరూపం అని విశదీకరించారు.

'వసంతే కపిల స్సూర్యో
గ్రీష్మే కాంచన సుప్రభః।
శ్వేతో వర్షా సువర్ణేన
పాండుశ్శరధి భాస్కరః॥

హేమంతే తామ్ర వర్ణస్తు
శిశిరే లోహితో రవిః।
ఇతి వర్ణా సమాఖ్యా
తాసూర్యసనతు సముద్భవా॥

అంటే విష్ణు కిరణ ప్రభావితమైన వసంతం పసుపు లేదా గోధుమ రంగులో ఉంటుంది. ఈ కిరణాలు ఉత్తరాయణంలో వికాసం చెంది గ్రీష్మానికి హేతువైన కాంతులు దక్షిణాయనంలో క్షీణిస్తాయని అర్థం.

హిందూ సంప్రదాయం ప్రకారం చైత్ర శుక్ల పాడ్యమి నాడే అనగా ఉగాది రోజున సృష్టి జరిగిందని నారద పురాణంలో వివరించారు. వసంతం ప్రారంభమైన చైత్రశుక్ల పాడ్యమి రోజున సూర్యుడు దినరాజై ఉండగా ప్రజాపతి బ్రహ్మ ఈ రస జగత్తును సృష్టించాడు. కాల గణన, గ్రహ నక్షత్ర, ఋతు, మాస వర్షాలను, వర్షాధిపులను ప్రవర్తింప చేశాడు. తెలుగు ప్రజలు చాంద్రమానాన్ని అనుసరిస్తారు. కాలగమనంలో మార్పులు సహజం. కల్పంలో యుగాలు ఉన్నాయి. యుగాలు మారేకొద్దీ ధర్మాలు కూడా మారుతాయి.

ప్రస్తుతం కలియుగం నడుస్తోంది. తెలుగు సంవత్సరాలకు ప్రత్యేకంగా పేర్లు ఉన్నాయి. ఆయా పేర్లను బట్టి ఫలితాలు ఎలా ఉంటాయో ఊహించి చెప్పవచ్చు. తెలుగుసంవత్సరాలు 60. ప్రభవతో మొదలై అక్షయతో ముగిస్తే ఒక ఆవృతం పూర్తయినట్లు. మళ్లీ తిరిగి ప్రభవతో ఆరంభమవుతుంది. ఈ పేర్ల వెనుక భిన్న వాదనలు ఉన్నాయి. ఒక కథనం ప్రకారం శ్రీకృష్ణుడి 16100 మంది భార్యల్లో సందీపని అనే రాజకుమారికి 60మంది సంతానం. వారి నామాలనే తెలుగు సంవత్సరాలకు పెట్టారని అంటారు. నారదుడి పిల్లల పేర్లు వీటికి పెట్టారనే మరో కథకూడా ప్రాచుర్యంలో ఉంది. దక్షుడు కుమార్తెల పేర్లుకూడా ఇవేనని అంటారు.

హిందువులకు అత్యంత శ్రేష్ఠమైన ఈ పండుగను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో జరుపుకుంటారు. ఆంధ్ర, కర్నాటకల్లో ఉగాది పేరుతోనూ, మహారాష్ట్రలో గుడిపాడ్వా పేరుతో పిలుస్తారు. తమిళులు పుత్తాండు, మలయాళీలు విషు అనే పేరుతోను, సిక్కులు వైశాఖీగానూ, బెంగాలీలు పొయ్‌లా బైశాఖ్ గానూ జరుపుకుంటారు. అయితే పండుగలను జరుపుకోవడంలో పెద్దగా తేడాలు లేవు.

"ఉగాది" ఆచరణ విధానం:

ఉగాది పర్వాచరణ విధానాన్ని 'ధర్మసింధు' కారుడు 'పంచవిధుల సమన్వితం'గా ఇలా సూచించారు.

1) తైలాభ్యంగనం 2) నూతన సంవత్సరాది స్తోత్రం 3) నింబకుసుమ భక్షణం (ఉగాది పచ్చడి సేవనం)
4) ధ్వజారోహణం(పూర్ణకుంభదానం) 5) పంచాంగ శ్రవణం.. మున్నగు 'పంచకృత్య నిర్వహణ' గావించవలెనని వ్రతగంథ నిర్దేశితం.

తైలాభ్యంగనం

తైలాభ్యంగనం అంటే నువ్వుల నూనెతో తలంటి పోసుకోవడం ప్రథమ విధి. ఉగాది వంటి శుభదినాలలో సూర్యోదయానికి పూర్వమే మహాలక్ష్మి నూనెలోను, గంగాదేవి నీటిలోను, ఆవహించి వుండునని ఆర్యోక్తి. కావున నూనెతో తలంటుకుని అభ్యంగన స్నానం చేసిన లక్ష్మి, గంగా దేవుల అనుగ్రహాన్ని పొందగలుగుతారు.

నూతన సంవత్సరాది స్తోత్ర పూజ

అభ్యంగ స్నానానంతరం సూర్యునికి, అర్ఘ్యదీపధూపాది, పుణ్యకాలానుష్ఠానం ఆచరించిన పిదప మామిడి ఆకులతోరణాలతో, పూలతోరణాలతో దేవుని గదిలో మంటపాన్ని నిర్మించి, అందు నూతన సంవత్సర పంచాంగాన్ని, సంవత్సరాది దేవతను, ఇష్టదేవతారాధనతో బాటు పూజించి ఉగాది ప్రసాదాన్ని (ఉగాది పచ్చడి) నివేదించవలెను.

"అబ్దాదౌ నింబకుసుమం
శర్కరామ్ల ఘృతైర్యుతమ్
భక్షితం పూర్వయామేతు
తద్వర్షే సౌఖ్య దాయకమ్"

అని ధర్మ సింధు గ్రంథం చెబుతున్నది. ఈ ఉగాది పచ్చడిని ఇంట్లో అందరూ పరగడుపున సేవించవలెను. ఉగాది నాడు ఉగాది పచ్చడి సేవించడం వల్ల సంవత్సరమంతా సౌఖ్యదాయకమని ఈ శ్లోక భావం.

పూర్ణ కుంభదానం

ఉగాదినాడు ఇంద్రధ్వజ, బ్రహ్మధ్వజ ప్రతిష్ఠాపన ఆచారంగా ఉన్నది. ఒక పట్టు వస్త్రాన్ని ఒక వెదురు గడకు పతాకం వలె కట్టి దానిపై నారికేళముంచబడిన కలశాన్ని వుంచి, ఆ కర్రకు మామిడి ఆకులు, నింబ పత్రాలు, పూల తోరణాలు కట్టి ఇంటి ప్రాంగణంలో ప్రతిష్ఠించి ఆరాధించడం ధ్వజారోహణం.

ఉగాది పచ్చడి సేవనం

ఉగాది నాటి ఆచారాలలో ఉగాది పచ్చడి సేవనం అత్యంత ప్రధానమైనది. వేపపూత, మామిడి పిందెలు, కొత్త చింతపండు, బెల్లం, ఉప్పు, మిరియాల షడ్రుచుల మిళితమైన రసాయనాన్నే ఉగాది పచ్చడి అంటాం.

పంచాంగ శ్రవణం

తిథి, వార, నక్షత్ర, యోగ, కరణములనెడి పంచ అంగాల సమన్వితం పంచాంగం. ఉగాదినాడు పంచాంగ శ్రవణం చేసేవారికి సూర్యుడు శౌర్యాన్ని, చంద్రుడు ఇంద్రసమాన వైభవాన్ని, కుజుడు శుభాన్ని, శని ఐశ్వర్యాన్ని, రాహువు బాహుబలాన్ని, కేతువు కులాధిక్యతను కలుగచేస్తారని చెప్పబడినది.

యంత్ర పరికరాల కోసం తీవ్ర పోటీ

ఆదిలాబాద్, మార్చి 27 (ప్రభాత సమాచారం)

రాష్ట్రంలోని మహిళల ఆర్థికాభివృద్ధి దిశగా ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. ఇప్పటికే పలు పథకాల ద్వారా 'వారికి లబ్ధి చేకూరుస్తుండగా.. తాజాగా వ్యవసాయ పనిముట్లను సైతం రాయితీపై మహిళా రైతులకు పంపిణీ చేయాలని కాంగ్రెస్ సర్కారు నిర్ణయించింది. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సైతం మొదలైంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ.72లక్షలు మంజూరు చేసింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వ 40 శాతం నిధులు భరిస్తున్నాయి.

దరఖాస్తుల స్వీకరణ షురూ..

గతంలో వ్యవసాయశాఖ కింద రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రాయితీపై అనేక యంత్ర పరికరాలు పంపిణీ చేసింది. సాగులో యాంత్రీకరణను ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టారు. అయితే 2016-17 ఆర్థిక సంవత్సరం నుంచి రాష్ట్రంలో ఈ పథకం నిలిచిపోయింది. అప్పటి నుంచి రైతులు యంత్ర పరికరాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ సర్కారు మళ్లీ యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించింది. సన్న, చిన్నకారు, ఇతర వర్గాల మహిళలు ఈ పథకానికి అర్హులు. ఈ నెల 25 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. దరఖాస్తులను వ్యవసాయశాఖ అధికారులు ఆన్లైన్ చేస్తున్నారు. మండల, జిల్లాస్థాయిలో ప్రత్యేక కమిటీల ఆధ్వర్యంలో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. వివిధ కంపెనీలకు చెందిన యంత్ర పరికరాలను రైతులకు సరఫరా చేస్తారు. సబ్సిడీ మొత్తాన్ని వ్యవసాయశాఖ సదరు కంపెనీ లకు చెల్లించనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ అధికారులు మండలాల వారీగా పరికరాలు కేటాయించారు.

యంత్ర పరికరాల కోసం తీవ్ర పోటీ...

యంత్రపరికరాల కోసం ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే అర్హుల ఎంపిక జిల్లా వ్యవసాయశాఖకు కత్తి మీద సాములా మారనుంది. రాష్ట్రలో 2017 లోనే యాంత్రీకరణ పథకం ఆగిపోయింది. అప్పటి నుంచి రైతులు ప్రైవేట్ యంత్ర పరికరాలు కొనుగోలు చేస్తున్నారు. మరికొందరు అద్దె ప్రతిపాదికన వినియోగించుకుంటున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం పథకాన్ని పునరుద్ధరించడంతో తీవ్రమైన పోటీ నెలకొంది. మరోవైపు జిల్లాలో పట్టా పాసు పుస్తకాలు ఉన్న రైతులు అతి తక్కువ మంది ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 4.50 లక్షలకు పైగా ఎకరాల్లో పంటలు సాగు చేస్తుండగా, ఎక్కువగా పురుషులకే పట్టాలు ఉన్నాయి. రాజకీయ జోక్యం లేకుండా, పారదర్శకంగా అర్హులను ఎంపిక చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం చేయాలి

- ఏప్రిల్ 30 లోపు కేసులను పరిష్కరించాలి
- సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పడితే కఠిన చర్యలు
- ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆదిలాబాద్ అధికారులతో సమీక్షా సమావేశం

ఆదిలాబాద్, మార్చి 27 (ప్రభాత సమాచారం)

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ఏప్రిల్ 30లోపు పరిష్కరించాలని రాష్ట్ర షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లా అధికారుల ఆదేశించారు. ఆదిలాబాద్ జిల్లాలో పర్యటనలో భాగంగా గురువారం జిల్లా కేంద్రానికి వచ్చిన కమిషన్ చైర్మన్‌కు జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. జిల్లాకు వచ్చిన చైర్మన్‌కు ఆయా సంఘాల నేతలు తమ వినతి పత్రాలు అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో చైర్మన్‌తో పాటు కమిషన్ సభ్యులు ప్రవీణ్, నీలాదేవి, లక్ష్మి నారాయణ, రాంబాబు నాయక్, శంకర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, భూ సమస్యల కేసులతో పాటు తదితర వాటిపై సమీక్షించారు. అనంతరం చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ... ఎస్సీ ఎస్టీ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పడితే కఠిన చర్యలు ఉం టాయన్నారు. ఆదిలాబాద్ జిల్లాపై ప్రత్యేక దృష్టిసారి ఇస్తామన్నారు. ఎస్సీ ఎస్టీలకు ఎలాంటి సమస్య ఉన్న కమిషన్ అండగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఐటీడీ ఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎఎస్పీ కాజల్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ఆర్డీవో వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం...

కొన్ని నెలల క్రితం అత్యాచారానికి గురైన మైనర్ బాలిక కుటుంబానికి అన్ని విధాల ఆదుకుంటామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గురువా రం మండల కేంద్రానికి వచ్చిన ఆయనను అధికారులు, దళిత సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. ముందుగా అంబేద్కర్, కొమరం భీమ్, అన్నాభాహు సాఠే విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మైనర్ బాలిక కుటుంబాన్ని ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు జరగడం బాధాకరం, అమానుషం, అనాగరిక చర్య అన్నారు. అమ్మాయి కుటుంబానికి కలెక్టర్ ప్రత్యేక నిధి నుండి ఆర్థిక సహాయం చేయాలని తక్షణమే కలెక్టర్‌ను ఆదేశిస్తామన్నారు. ఈ కేసులో పోలీసులు 22 మందిపై కేసు నమోదు చేశారని అందులో ఎవరైతే తప్పు చేశారో వారికి తప్పని సరిగా శిక్ష పడాల్సిందేనని, తప్పు చేయని అమాయకుల మీద ఉన్న కేసులను వెంటనే ఎత్తివేయాలని ఎస్పీకి ఆదేశాలు ఇస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలాదేవి, తహసీల్దార్ కవితా రెడ్డి, ఎంపీడీవో హైమద్ ఖాన్, దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.

చెరువు కబ్జాపై స్పందించిన ఇరిగేషన్ అధికారులు

బెల్లంపల్లి, మార్చి 27 (ప్రభాత సమాచారం)

బెల్లంపల్లి మండలంలో చాకిపల్లి గ్రామంలో గల గున్ని కుంట చెరువు ను కొంతమంది స్థానికులు కబ్జా చేసిన వ్యవహారంపై ఇరిగేషన్ అధికారులు స్పందించారు. గురువారం గ్రామానికి చేరుకొని చెరువు వద్ద సర్వే చేశారు. కబ్జా అయిన చెరువులు పరిశీలించి తమకు న్యాయం చేయాలని గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు, స్థానిక మాజీ ఎంపీటీసీ ముడిమడుగుల మహేందర్ ఇరిగేషన్ అధికారులను కోరడంతో గురువారం చెరువు ఎఫ్‌టిఎల్ వరకు సర్వే జరిపి హద్దులు నిర్ణయించారు. బెల్లంపల్లి ఇరిగేషన్ ఏఈలు ప్రణీత్, సునీత, వర్క్ ఇన్స్పెక్టర్ శంకర్‌లు సర్వేలో పాల్గొన్నారు.

అభివృద్ధిపేరుతో వసూళ్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి

ఆదిలాబాద్, మార్చి 27 (ప్రభాత సమాచారం)

గ్రామ అభివృద్ధి పేరుతో చట్ట వ్యతిరేకంగా ఎవరి వద్దనైనా గ్రామ అభివృద్ధి కమిటీలు, వ్యక్తులు కానీ డబ్బులు వసూలు చేసిన వారిపై కేసులు నమోదు చేయబడతాయని ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి హెచ్చరించారు. చట్ట వ్యతిరేకంగా ప్రైవేటు సంస్థలు, వీడీసీలు ఎవరైనా డబ్బులు వసూలు చేసిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేయబడతాయని అన్నారు. గురువారం జైనథ్ మండలం సాంగవీ గ్రామం శివారు పెన్‌గంగ నుండి ప్రభుత్వ పనుల నిమిత్తం ట్రాక్టరులో ఇసుక తీసుకువెళ్తుండగా సాంగ్వి గ్రామాభివృద్ధి కమిటీ పేరుతో చక్రి అనే వ్యక్తి 300 రూపాయలు బలవంతంగా ట్రాక్టర్ డ్రైవర్ వద్ద నుండి తీసుకున్నట్లు, ట్రాక్టరు డ్రైవర్ షఫీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. అక్రమ వసూళ్ళకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

కార్మిక క్షేత్రం బెల్లంపల్లికి మహర్దశ!

- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు
- రూ.200 కోట్లతో ఆశ్రమ పాఠశాల
- 25 ఎకరాల్లో అత్యున్నతమైన విద్యాలయం

బెల్లంపల్లి, మార్చి 27 (ప్రభాత సమాచారం)

ఎట్టకేలకు బెల్లంపల్లి కార్మిక క్షేత్రం మహర్దశ సంతరించుకుంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలకు ప్రకటించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాల మంజూరులో బెల్లంపల్లికి చోటు కల్పించారు. దీంతో ఈ ప్రాంత వాసుల్లో సంతోషం వెల్లివెరుస్తోంది. పారిశ్రామిక ప్రాంతంగా పేరుగాంచి భూగర్భ గనుల వెనుకడుగుతో బెల్లంపల్లి ఉనికినీ కోల్పోతుంది. ఈ నేపథ్యంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరుతో బెల్లంపల్లికి పూర్వ వైభవం రానుంది. నూతనంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరులో బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల నియోజక వర్గాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. రూ. 200 కోట్లతో ఒక్కో పాఠశాల 25 ఎకరాల విస్తీర్ణంలో అత్యున్నతమైన ప్రమాణాలతో భవనాలు ఏర్పాటు చేయనున్నారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాల విద్యాబోధన లభిస్తుంది. భవిష్యత్తులో కేజీ నుంచి పీజీ వరకు ఈ ప్రాంతం పిల్లలకు అత్యున్నతమైన విద్య అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

ఎమ్మెల్యే వినోద్ ప్రత్యేక చొరవ...

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరులో ప్రత్యేక చొర వను కనపరిచినట్లు తెలుస్తుంది. సీఎం రేవంత్ రెడ్డిని ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు విషయంలో తగిన శ్రద్ధ వహించి అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. బెల్లంపల్లిలో పాలిటెక్నిక్ కళాశాల మాత్రమే ఉన్నత విద్యా అవ కాశాలకు ఏకైక మార్గంగా ఉంది. ఎంతోకాలంగా ఈ ప్రాంత ప్రజలు తమ పిల్లల ఉన్న త విద్య కోసం సుదూర ప్రాంతాలకు పంపిస్తున్నారు.

లక్షల రూపాయలను కార్పొరేటు కళాశాలలకు ఫీజులు రూపంలో చెల్లిస్తూ పిల్లల భవిష్యత్తు కోసం అష్టకష్టాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా మంజూరైన ఇంటిగ్రేటెడ్ పాఠశాలతో ఈ ప్రాంత విద్యార్థులు అందిపుచ్చుకోనున్నారు. ఇప్పటి వరకు బెల్లంపల్లి ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించిన ఏ ఎమ్మెల్యే, ప్రభుత్వాన్ని ఒప్పించి ఉన్నత విద్య కళాశాలను సాధించిన ఘనత లేదు. బెల్లంపల్లిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను సాధించి ఎమ్మెల్యే గడ్డం వినోద్ రికార్డును సొంతం చేసుకున్నారు. ఇదే కాకుండా బెల్లంపల్లిలో ఇంజనీరింగ్ కళాశాల కూడా తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముమ్మరంగా ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఇంజనీరింగ్ కళాశాల ఒకటి అనే విషయం తెలిసిందే. ఇది ఇలా ఉంటే అత్యున్నతమైన విద్య ప్రమాణాలు గల స్కూల్‌ను సాధించడంతో ఈ ప్రాంత ప్రజలు ఆనంద డోలికల్లో మునిగిపోతున్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరుతో బెల్లంపల్లి జాతీయస్థాయిలో విద్య ప్రమాణాల సరసాన నిలువనుంది. ఏది ఏమైనా ఈ ప్రాంత ప్రజల ఊహకందని అత్యున్నతమైన విద్య ప్రమాణాలు గల యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కల నెరవేరినట్టయింది. ఈ మేరకు అధికారగణం స్కూల్ నిర్మాణం కోసం 25 ఎకరాల స్థల సేకరణలో ఉన్నారు. స్థలం గుర్తింపు ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేశారని సమాచారం. ఆమోదయోగ్యమైతే త్వరలోనే ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ స్కూల్ ఏర్పాటులో తొలి ఘట్టం సుఖాంతమైనట్టే.

నార్కోటిక్ జగిలాలతో తనిఖీలు

చెన్నూరు, మార్చి 27 (ప్రభాత సమాచారం)

తెలంగాణ – మహారాష్ట్ర సరిహద్దు కోటపల్లి మండలంలోని రాపనపల్లి చెక్పోస్ట్ వద్ద జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, కోటపల్లి ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో నార్కోటిక్ డాగ్స్‌తో గురువారం రాత్రి 11 సమంయలో గంటలకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మహారాష్ట్ర వెళ్లే, అక్కడ నుంచి చెన్నూరు వైపు ప్రవేశించే వాహనాలను క్షుణ్ణంగా నార్కోటిక్ ఎనాలిసిస్ డాగ్ ద్వారా పోలీస్ సిబ్బందితో అన్ని వాహనాలను, సామాగ్రిని పరిశీలించారు.

గంజాయిని అరికట్టడమే లక్ష్యంగా..

గంజాయి రహిత ప్రాంతంగా మార్చడానికి ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టామని జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందులో భాగంగానే పెట్రోలింగ్ ముమ్మరం చేయడం, ప్రజల్లో అవగాహన కల్పించడం, గంజాయి అక్రమ రవాణాపై స్పెషల్ డ్రైవ్ లు, నార్కోటిక్ జగిలాలతో తనిఖీలు చేపడుతూ గంజాయి రవాణాను అరికడుతున్నామన్నారు. తనిఖీలలో ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది, టీఎస్ఎన్‌పి సిబ్బంది, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విమానాశ్రయం ఆవశ్యకతపై పార్లమెంట్‌లో ప్రస్తావించిన ఎంపీ నగేష్

ఆదిలాబాద్, మార్చి 27 (ప్రభాత సమాచారం)

ఆదిలాబాద్ జిల్లా ప్రజల చిరకాల కోరిక ఆయిన విమానాశ్రయం మంజూరు చేయాలని ఎంపీ గోడం నగేష్ కోరారు. విమానాశ్రయం గురించి గురువారం పార్లమెంట్ సమావేశంలో ఆయన ప్రస్తావించారు. కేంద్ర విమానయాన మంత్రి ఇటీవల మాట్లాడుతూ.. ఆదిలాబాద్ విమానాశ్రయం వ్యూహాత్మకమైన ప్రాంతమని, తెలంగాణ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, చత్తీస్గడ్ రాష్ట్రాలకు ఎంతో ఉపయోగమని అన్నారని ఎంపీ గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి ఫీజిబిలిటీ రిపోర్ట్‌ను తెప్పించి విమానాశ్రయం మంజూరు చేయాలని కోరారు.